

'దారి'ద్ర్యం

- వర్షాలకు రోడ్లు బురదమయం
- మారుమూల ప్రాంతాల్లో మరీ అధ్వానం
- రాకపోకలకు వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, పాలకులు

జిల్లా వ్యాప్తంగా గ్రామాల్లోని మట్టి రోడ్లు అధ్వానంగా మారాయి. వర్షాలు పడితే నడక కూడా కష్టం మారుతోంది. బురదరోడ్లపై వాహనదారులు, పాదచారులు నడవడానికి తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఏళ్లు గడుస్తున్నా తారు రోడ్లకు నోచుకోవడం లేదు.



ఆసిఫాబాద్ మండలంలోని రాజురాలో కల్వర్టు తెగిపోవడంతో రాకపోకలకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్థులు

ఆసిఫాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గ్రామీణ రోడ్లు అధ్వానంగా మారాయి. చినుకు పడితే చాలు రోడ్లు చిత్తడిగా మారి ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపిస్తున్నాయి. కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలో మారు మూల గ్రామాలు నేటికి కనీసం రహదారులకు నోచుకోని దుస్థితి నెలకొంది. దీంతో ఆయా గ్రామాల ప్రజలు వర్షం వస్తే చాలు భయంగుప్పిట్లో మగ్గాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇక అత్యవసర పరిస్థితుల్లో దేవుడిపై భారం వేసి నాటు వైద్యంను ఆశ్రయించాల్సిన వస్తుంది. దీంతో ఒక్కోసారి ప్రాణాలు గాలిలో కలిసి పోయిన సంఘటనలు ఉన్నాయి. గ్రామాల్లో డయేరియా, మలేరియా తదితర సీజనల్ వ్యాధులు ప్రబలినట్లయితే గ్రామాల్లో వైద్య శిబిరాలు నిర్వహించేందుకు 104, 108 వాహనాలు సైతం వెళ్లలేని దయనీయ దుస్థితి నెలకొంది. పాలకులు రోడ్లు నిర్మిస్తామని హామీ ఇస్తున్నా ఆచరణకు నోచుకోవడం లేదు. వారం రోజులుగా జిల్లా అంతట కురుస్తున్న భారీ వర్షాల కారణంగా రోడ్లన్నీ బురదమయం కావడం, లో లెవల్ వంతెనల పై నుంచి వరద నీరు ప్రవహిస్తుండడంతో పాఠశాలలకు, కళాశాలలకు వెళ్లే విద్యార్థులతో పాటు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రాలకు, జిల్లా కేంద్రానికి వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

● చిత్తడి..చిత్తడి..

జిల్లాలోని 15 మండలాల పరిధిలోని ఆయా గ్రామాల్లో చిన్న పాటి వర్షానికే రోడ్లన్నీ చిత్తడిగా మారి నడవడానికి సైతం వీలు లేకుండా పోతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు లోనవుతున్నారు. జిల్లాలో మండలాల వారీగా రోడ్ల దుస్థితిని పరిశీలిస్తే... ఆసిఫాబాద్ మండలంలోని హీరాపూర్, గుడిగుడి, అప్పపల్లి, మోవాడ, అడదస్నాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని ఏజెన్సీ గ్రామాల రోడ్లు వర్షానికి చిత్తడిగా మారడంతో ప్రజ లు ఇబ్బందులు పడుతున్నారు. అలాగే ఇటీవల కురిసిన వర్షాలకు రాజురా గ్రామంలోని కల్వర్టు కొట్టుకుపోయింది. దీంతో రాకపోకలకు గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. వాంకిడి మండలంలోని సామెల, కిర్డి, కెరమెరి మండలంలోని నాగల్‌గొంది, కైరి, నీమ్‌గూడ, నిశానీ, లింగాపూర్ మండలంలోని లెండిగూడ, చోర్ పల్లి, బీమన్‌గోంది, లొద్దిగూడ, మొడిగూడ, హీరాపూర్, జైనూర్ మండలంలో రావూజీగూడ, లొద్దిగూడ సిర్పూర్(యూ) మండలంలో చాప్రి, బుర్నూర్-కె గ్రామాల రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. తిర్యాణి మండలంలోని అర్జున్‌లొద్ది, అల్లిగూడ, భీంరాల, మార్కగూడ, ఏదులపహాడ్, పంగిడి, పాతదంతన్‌పల్లి, బెజ్జూరు మండలంలోని కృష్ణపల్లి- సోమిని, రంగాపూర్, అంబగట్టు, బుర్గుడ, రెచిని, ఇందూర్‌గాం, నలుగుపల్లి గ్రామాలలోని అంతర్గత రోడ్లు బురదమయంగా మారాయి. దహెగాం మండలంలోని పోలంపల్లి, బోప్పరం, మొర్లిగూడ, పెంచికలపేట మండలంలో కొండపల్లి, జైహింద్‌పూర్, మొర్లిగూడ, కమ్మర్ గాం, అగర్‌గూడ తదితర గ్రామాల్లో రోడ్లు పూర్తిగా అధ్వానంగా మారాయి. దీంతో ఆయా గ్రామాల ప్రజలు రాక పోకలు సాగించేందుకు ఇబ్బందులు పడుతున్నారు. తప్పని సరి పరిస్థితుల్లో బురదలోనే నడుచుకుంటూ గమ్యస్థానాలకు వెళ్తున్నారు. గ్రామీణ రోడ్ల దుస్థితి దయనీయంగా ఉన్నా పాలకులు కానీ అధికారులు కానీ పట్టించుకోవడం లేదని చెబుతున్నారు.

● గ్రామీణ రోడ్లు అధ్వానం..

జిల్లాలో ఎక్కడ లేని రీతిలో గ్రామీణ రహదారుల వ్యవస్థ పూర్తిగా అధ్వానంగా తయారైంది. రోడ్లు నిర్మించక పోవడంతో ఆయా గ్రామాలు వాగులు, వంకల గుండా, అడవుల మీదుగా ప్రయాణించాల్సిన దుస్థితి దాపురించింది. ప్రధాన రహదారుల నుంచి గ్రామాలకు వెళ్లే రోడ్లతో పాటు అంతర్గత రహదారుల వ్యవస్థ సరిగ్గా లేక పోవడంతో నేటికీ పల్లెలు అభివృద్ధి నోచుకోవడం లేదు. జిల్లా అధికార యంత్రాంగం నిర్వహించిన అధ్యాయనంలో మొత్తం 335 గ్రామ పంచాయతీల పరిధిలోని 449 గిరిజన గూడాలకు అసలే రోడ్డు సౌకర్యం లేనట్లుగ గుర్తించారు. ఇందులో ఆసిఫాబాద్ నియోజక వర్గానికి సంబంధించి అత్యధికంగా 305 గ్రామాలు ఉన్నాయి. సిర్పూర్ నియోజక వర్గంలో 144 గ్రామాలకు రోడ్ల నిర్మాణం జరగాల్సి ఉన్నట్లు గుర్తించారు.



బురదమయంగా మారిన లింగాపూర్ మండలంలోని జాముల్‌ధర-దాంపూర్ రోడ్డు



బురదలో నడుచుకుంటూ వస్తున్న ఆసిఫాబాద్ మండలంలోని హీరాపూర్ గ్రామస్థులు

ఇబ్బందులు పడుతున్నాం..

\- రాథోడ్ అనిల్, లొద్దిగూడ, లింగాపూర్ మండలం



ఏటా వర్షాకాలంలో రోడ్లు బురదమయంగా మార డంతో ఇబ్బందులు పడుతున్నాం. పనుల కోసం మం డల, జిల్లా కేంద్రాలకు బురద రోడ్ల మీదుగా అష్టక ష్టాలు పడుతూ వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి తారురోడ్ల నిర్మాణం చేపట్టి మా కష్టాలను గట్టెక్కించాలి.

మొక్కలు నాటి సంరక్షించాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే హరీష్‌బాబు

కాగజ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే హరీష్‌బాబు అన్నారు. కాగజ్‌నగర్ మండలం కోయవాగు సమీపంలోని మైనార్టీ రెసిడెన్షియల్ పాఠశాలలో బుధవారం వన మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలన్నారు. నాటిన మొక్కలను సంరక్షించే బాధ్యత తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీడీవో కోట ప్రసాద్, ఇన్‌చార్జి మైనార్టీ సంక్షేమ అధికారి నదీం, ఆర్ఎల్‌సి పుష్పలత, ఏపీవో చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు.

మొక్కలతోనే మానవుడి మనుగడ



మొక్కలు నాటుతున్న నాయకులు

జైనూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మొక్కలతోనే మానవ మనుగడ ఆధార పడి ఉందని జైనూర్ మార్కెట్ కమిటీ చైర్మన్ కుడిమెత విశ్వనాథ్ అన్నారు. మండల కేంద్రంలోని సహకార కార్యాలయంలో బుధవారం మార్కెట్ కమిటీ చైర్మన్ విశ్వనాథ్, మండల సహకార చైర్మన్ కొడప హన్ను పటేల్, సిర్పూర్(యు) సహకార చైర్మన్ కేంద్రె శివాజీ, సిబ్బంది కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా కుడిమెత విశ్వనాథ్ మాట్లాడుతూ మొక్కల నాటడం వల్ల మానవాళికి అనేక లాభాలున్నాయని చెప్పారు. మొక్కలు లేకుండా జీవరాసుల మనుగడ కష్టమన్నారు. . కార్యక్రమంలో సహకార బ్యాంక్ మేనేజర్ రాజేశ్వర్, సీనియర్ ఆడిటర్ శ్యామ్యూల్, జైనూర్ సిర్పూర్ (యు) సీఈవోలు సోనాకంబ్లే జనార్దన్, కనక రమేశ్, కార్యదర్శి ప్రకాష్, మాజీ సర్పంచులు మడావి భీంరావ్, మేస్రాం మొహపత్‌రావ్ పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్‌కు వినతి

కాగజ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆర్‌బీ పాఠశాల సమస్యలను పరిష్కరించాలని బుధవారం ఇత్తెహాఫౌండేషన్ టీం సభ్యులు సబ్‌కలెక్టర్ శ్రద్ధా శుక్లాకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు ఇల్‌ముల్‌హక్, వైస్ ప్రెసిడెంట్ పరీద్ మాట్లాడుతూ ఆర్ బీ పాఠశాల భవనం శిథిలావస్థకు చేరిందని తెలిపారు. దీంతో విద్యార్థులు భయాందోళన చెందుతున్నారని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

జీవో 49ని ఉపసంహరించుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం టైగర్ కన్జర్వేషన్ రిజర్వుగా ప్రకటిస్తూ తీసుకువచ్చిన జీవో 49 వెంటనే ఉపసంహరించుకొవాలని తెలంగాణ ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి సచిన్ డిమాండ్ చేశారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. టైగర్ కన్జర్వేషన్ రిజర్వుగా ఏర్పాటు చేస్తే ఆదివాసీల పోడు భూముల హక్కులకు భంగం కలుగుతుందన్నారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాలశ్రీ, అశోక్, ఉపాధ్యక్షులు కోట శ్రీనివాస్, గణపతి తదితరులు పాల్గొన్నారు.

సీజ్ చేసిన మద్యం ధ్వంసం



రోడ్డురోలర్‌తో ధ్వంసం చేస్తున్న మద్యం సీసాలు

చింతలమానేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కుమరం భీం ఆసిఫాబాద్ జిల్లాలోని చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో ఈ ఏడాది ఫిబ్రవరి 26న ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో పట్టుబడిన మద్యం సీసాలను బుధవారం పోలీసులు రోడ్డురోలర్‌తో ధ్వంసం చేశారు. ఎన్నికల కోడ్ ఉన్న సమయంలో అధికారుల అందిన సమాచారం మేరకు చింతలమానేపల్లి మండలంలోని గూడెం గ్రామంలో తనిఖీ చేశారు. గ్రామంలో నలుగురు వ్యక్తులు తమ ఇళ్ల వద్ద అక్రమంగా నిల్వ చేసిన రూ.21,50,890 విలువ చేసే మద్యం బాటిళ్లు పట్టుబడ్డాయి. అందులో 10,155 బీర్లు, 224 వైన్ బాటిళ్లు, 16 బ్రీజర్ సీసాలు ఉన్నాయి. పట్టుబడిన మద్యాన్ని స్థానిక పోలీస్ స్టేషన్‌లో నిల్వ ఉంచారు. న్యాయ పరమైన ప్రక్రియ పూర్తి కావడంతో నాలుగు కేసులకు సంబంధించి సీజ్ చేసిన రూ. 21,50,890 విలువ గల మద్యాన్ని జిల్లా ఎస్పీ కాంతి లాల్ పాటిల్, ఎక్సైజ్ అధికారి జ్యోతి కిరణ్ సమక్షంలో పోలీస్ స్టేషన్ ఆవరణలో వీడియో రికార్డింగ్ చేస్తూ ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ఎక్సైజ్ చట్టం 34ఏ, ఆర్‌పీచట్టం 135సీ కింద కేసులు నమోదు చేయగా న్యాయ పరంగా ప్రక్రియ పూర్తి కావడంతో ధ్వంసం చేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేష్, చింతలమానేపల్లి ఎస్సై ఇస్లావత్ నరేష్, డిప్యూటీ తహసీల్దార్ దౌలత్, పోలీస్ సిబ్బంది, పాల్గొన్నారు.

ప్రజారోగ్యంపై పట్టింపు లేదు

సిర్పూరు(టి), జూలై 2 (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వానికి ప్రజారోగ్యంపై పట్టింపే లేదని అఖిల భారత ప్రజాతంత్ర మహిళ సంఘం కేంద్ర కమిటీ సభ్యులు ఆశలత తెలిపారు. సీహెచ్‌సీ సెంటర్‌ను బుధవారం ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను రోగుల నుంచి అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వర్షా కాలం అత్యవసర పరిస్థితుంటాయని, కనీసం ఈ ఆసుపత్రిలో వైద్యులను రాష్ట్ర ప్రభుత్వం ఇంత వరకు నియమించలేదన్నారు. మహిళ కోసం ప్రత్యేక గైనకాలోజిస్టును వెంటనే నియమించాలన్నారు. పేరుకే వంద పడకల ఆసుపత్రి ఉన్నట్లు, కనీసం 50 పడకలు కూడా లేవని తెలిపారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మాచర్ల వినోద, దుర్గం అనిత, జిల్లా సహాయక కార్యదర్శి పద్మ, జిల్లా నాయకులు కృష్ణమాచారి సభ్యులు పాల్గొన్నారు.

అధికారుల తీరుపై రైతుల ఆగ్రహం

రెబ్బెన, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వ్యవసాయ సహకారం సంఘంలో బుధవారం ఎరువుల పంపిణీలో వ్యవసాయాధికారులు తీరుపై రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పలువురు రైతులు మాట్లాడుతూ ఎరువులను అధికారులు కొందరికి ఇష్టారాజ్యంగా ఇస్తున్నారని చెప్పారు. మరి కొందరికి రెండు బస్తాలు మాత్రమే ఇస్తున్నారని అధికారులపై మండి పడ్డారు. విషయం తెలుసుకున్న ఎస్సై చంద్రశేఖర్ సంఘటన స్థలానికి చేరుకొని రైతులను సముదాయించి నిబంధనల ప్రకారం పంపిణీ చేయటంతో సమస్య సద్దుమణిగింది.

ఆదివాసీల అభ్యున్నతికి కృషి

సిర్పూర్(యు), జూలై 2 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి. ఆదివాసీ నాయకుడు గోడం రామారావు ఆదివాసీల అభ్యున్నతికి కృషి చేశారని మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ ఆత్రం భగవంత్‌రావు అన్నారు. మండల కేంద్రంలోని గాంధీచౌక్‌లో ఉన్న గోడం రామారావు విగ్రహానికి బుధవారం పూల మాలలు వేసి ఆదివాసీ నాయకులు ఘనంగా నివాళులర్పించారు. మాజీ మంత్రి గోడం రామారావు జయంతిని పురస్కరించుకొని మండల కేంద్రంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వీటీడీఏ మండల చైర్మన్ కుమ్ర భీంరావు, మాజీ ఎంపీపీ ఆత్రం దౌలత్‌రావు, నాయకులు సిడం సుభాష్, అంబారావు పాల్గొన్నారు

సమ్మెలో కార్మికులు పాల్గొనాలి

రెబ్బెన, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా 9వ తేదీన నిర్వహిచే సమ్మెలో కార్మికులు పాల్గొనాలని జేఏసీ, హెచ్‌ఎంఎస్ యూనియన్ ఏరియా వైస్ ప్రెసిడెంట్ రాజబాబు అన్నారు. ఖైరిగూడ ఓసీపీ వద్ద బుధవారం ఆయన మాట్లాడారు. టీఎస్టీయూసీ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మనిరాం సింగ్, ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షులు చాంద్ పాషా మాట్లాడుతూ కార్మికుల హక్కుల సాధన కోసం అఖిల భారత సమ్మె చేపడుతున్నామని తెలిపారు. సమావేశంలో హెచ్‌ఎంఎస్ ఏరియా బ్రాంచ్ సెక్రటరి శివారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పనులు వేగవంతం చేయాలి



ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ దీపక్ తివారి

కెరమెరి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల పనులను వేగవంతం చేయాలని అదనపు కలెక్టర్ దీపక్ తివారి అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో ఇందిరమ్మ ఇళ్ల పురోగతిని బుధవారం అదనపు కలెక్టర్ ఎంపీడీవోను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సమస్యాత్మక గ్రామాల్లో నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇంటిని నిర్మించుకునే విధంగా లబ్ధిదారులకు అవగా హన కల్పించాలన్నారు. బేస్ మెంట్ స్థాయి వరకు పూర్తయిన నిర్మాణాలకు సంబంధించిన బిల్లులు చెల్లించే విధంగా చర్యలు తీసుకోవాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాలలో మౌలిక వసతులు, తాగునీరు, ఇతర పరిసరాలను పరిశీలించారు. విద్యార్థులకు ఎలాంటి అసౌకర్యాలు కలుగకుండా సదుపా యాలు కల్పించాలన్నారు. ప్రయోగశాల పరికరాల సహాయంతో ఆచరణాత్మక పద్ధతిలో విద్యార్థులకు అర్థమ య్యే విధంగా విద్య బోధన చేయాలని సూచించారు. అనంతరం హట్టి ఆశ్రమోన్నత పాఠశాలను సందర్శించి వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలు తీసుకోవాలని సూచించారు. ఝరి గ్రామంలోని మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలను తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజన మెనూ, వంట సామగ్రిలను పరిశీలించారు. నూతన మెనూ ప్రకారం విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలని చెప్పారు. విద్యార్థుల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహించాలని సూచించారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. వర్షాకాలం నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని గమనించాలని సిబ్బందికి సూచించారు. ఎలాంటి ఇబ్బందులు తలెత్తినా అధికారులకు సమాచారం ఇవ్వాలన్నారు. తరగతి గదిలో విద్యార్థులకు బోధించారు. అనంతరం రింగన్‌ఘాట్, కొఠారి గ్రామాల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ ఇళ్ల పనులను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఆయన వెంట ఎంపీడీవో అన్జద్‌పాషా, ఎంఈవో అడె ప్రకాష్, కళాశాల ప్రిన్సిపాల్ ఆస్మత్ ఆలీ, కార్యదర్శులు సతీష్, ఈశ్వర్ తదితరులు ఉన్నారు.

పారిశుధ్యంపై దృష్టి సారించాలి

సిర్పూరు(టి), జూలై 2 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ కార్యదర్శులు వారి గ్రామపంచాయతీల్లో వర్షాకాలం సందర్భంగా పారిశుధ్యం, వన మహోత్సవంపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా పంచాయతీ అధికారి భిక్షపతిగౌడ్ అన్నారు. సిర్పూరు(టి) మేజర్ గ్రామపంచాయతీని బుధవారం డీపీవో తనిఖీ చేశారు.

చెత్తాచెదారం తొలగించాలి

జైనూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మారుమూల గ్రామాల్లో గ్రామ కార్యదర్శులు గ్రామస్థుల సమన్వయంతో చెత్తాచెదారం ఎప్పటికప్పుడు తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో సుధాకర్ రెడ్డి అన్నారు. స్థానిక ఎంపీడీవో సమావేశ మందిరంలో బుధవారం గ్రామ కార్యదర్శులు, ఈజీఎస్ సిబ్బందితో ఏర్పాటు సమావేశంలో ఎంపీడీవో మాట్లాడారు.

చర్యలు తీసుకోవాలి

కెరమెరి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని హకా కేంద్రం నిర్వహకుడిపై చర్యలు తీసుకోవాలని పెసా యాక్టు మండల కో ఆర్డినేటర్ భరత్ భూషణ్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ హకా కేంద్రం నిర్వహకుడు రైతులు కొనుగోలు చేసిన యూరియా, డీఏపీలకు రశీదులు కాకుండా పేపరుపై రాసి ఇస్తున్నాడని, అధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు.

మహిళల గోరింటాకు సంబరాలు



గోరింటాకు సంబరాల్లో పాల్గొన్న మహిళలు

కాగజ్‌నగర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాగజ్‌నగర్ ఆర్యవైశ్య భవన్‌లో బుధవారం జిల్లా ఆర్యవైశ్య మహాసభ, జిల్లా ఆర్యవైశ్య మహిళ సంఘం ఆధ్వర్యంలో గోరింటాకు సంబరాలు ఘనంగా జరిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షురాలు కొలిపాక పూజ మాట్లాడుతూ ఆషాడ మాసాన్ని పురస్కరించుకొని తాము జిల్లా స్థాయి గోరింటాకు సంబరాలు చేపట్టామని చెప్పారు. కార్యక్రమానికి జిల్లా నలుమూల నుంచి ఆర్యవైశ్యసంఘం మహిళ సభ్యులు హాజరయ్యారని తెలిపారు. కార్యక్రమంలో సెక్రటరి లావణ్య, ట్రేజరర్ బోనగిరి మౌనిక, ఆర్గనైజింగ్ సెక్రటరి పి వాణి, కంభంపాటి అర్చన తదితరులు పాల్గొన్నారు.

అనుచిత వ్యాఖ్యలు చేస్తే బుద్ధి చెబుతాం

బెజ్జూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మంత్రి సీతక్కపై మరోసారి అనుచిత వాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెబుతామని టీపీసీసీ సభ్యుడు హర్షత్ హుస్సేన్ అన్నారు. మండల కేంద్రంలో బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ నుంచి సస్పెండ్ అయిన రావి శ్రీనివాస్ మంత్రిపై అనవసర వ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో తడాఖా చూపెడతానని చెప్పుకుంటున్న రావి శ్రీనివాస్ మూడు సార్లు ఎమ్మెల్యేగా పోటీ చేస్తే కనీసం డిపాజిట్లు కూడా దక్కలేదని చెప్పారు. ఇప్పటికైనా అనుచిత వ్యాఖ్యలపై బేషరతుగా క్షమాపణ చెప్పాలని లేనిచో గ్రామాల్లో తిరగనివ్వమని హెచ్చరించారు. సమావేశంలో పార్టీ మండల అధ్యక్షుడు శంకర్, నాయకులు పెంటయ్య, లింగయ్య, షణ్ముఖ, గుమ్ముల శ్రీనివాస్, తిరుపతి, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గాల్లో కాంగ్రెస్ బలోపేతమే ధ్యేయం



మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్లమెంట్ ఇన్‌చార్జి చుక్క రమేశ్‌బాబు

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గాల్లో పార్టీ బలోపేతమే ధ్యేయంగా కాంగ్రెస్ అధిష్ఠానం చర్యలు తీసుకుంటోందని పార్టీ పార్లమెంట్ ఇన్‌చార్జి చుక్క రమేశ్‌బాబు అన్నారు. జిల్లా కేంద్రంలోని పార్టీ కార్యాలయంలో బుధవారం డీసీసీ అధ్యక్షులు కొక్కిరాల విశ్వప్రసాద్‌రావు, మాజీ ఎమ్మెల్యే ఆత్రం సక్కులతో కలిసి సమావేశంకు నాయకుల తరలింపుపై చర్చించారు. ఈ సందర్భంగా అయన విలేకరులతో మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఈనెల 4న మొట్టమొదటి సారిగా నిర్వహించే పార్టీ బూత్ లెవల్ సమావేశానికి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి నాయకులు పెద్ద ఎత్తున తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్‌ఖర్గే ముఖ్య అతిథిగా హాజరు కానున్నారని చెప్పారు. రాష్ట్ర వ్యాప్తంగా 17 నియోజకవర్గాలలో సంస్థాగతంగా పార్టీని బలోపేతం చేయడానికి ఇన్‌చార్జిలను, కో ఇన్‌చార్జిలను నియమించిందన్నారు. బూత్ లెవల్ సమావేశానికి జిల్లాలోని రెండు నియోజకవర్గాల నుంచి 1,200 మంది నాయకులను తరలించేందుకు ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎంపీపీ బాలేశ్వర్‌గౌడ్, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ మునీర్‌అహ్మద్, పార్టీ మండల అధ్యక్షుడు మసాదే చరణ్ పాల్గొన్నారు.

షూటింగ్‌బాల్ జిల్లా కార్యవర్గం

ఆసిఫాబాద్‌రూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కుమరంభీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలోని కుమరంభీం స్టడీ సర్కిల్‌లో బుధవారం రాష్ట్రస్థాయి షూటింగ్‌బాల్ అసోసియేషన్ ఆదేశాల మేరకు జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవికుమార్, కార్యదర్శిగా దుర్గం రవిందర్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికైన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ అసోసియేషన్ అభివృద్ధికి పాటుపడతామని తెలిపారు. కార్యక్రమంలో పీడీలు మధుసూదన్, విద్యాసాగర్, సారంగపాణి, లక్ష్మి, ఖేలో ఇండియా కోచ్ కడతల రాకేష్ తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోవాలి

ఆసిఫాబాద్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారం కోసం జిల్లాలోని ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో యాదయ్య బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని జిల్లా పరిషత్, మండల పరిషత్, ఎయిడెడ్ పాఠశా ల, జవహర్ నవోదయ విద్యాలయాలు, ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలలు, సీబీఎస్ఈకి అనుబంధంగా ఉన్న పాఠశాలలు, ప్రభుత్వ గుర్తింపు పొందిన ప్రైవేటు పాఠశాలల ఉపాధ్యాయులు, ప్రధానోపాధ్యాయులు 2025 సంవత్సరానికి జాతీయస్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తుందని పేర్కొన్నారు. అర్హతగల ఉపాధ్యాయులు జూలై 13లోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో నమోదు చేసుకొని డీఈవో కార్యాలయంలో సమర్పించాలని సూచించారు.

ఇక ఓటరు నమోదు నిరంతర ప్రక్రియ



నియోజకవర్గాల వారీగా ఓటర్ల వివరాలు

నియోజకవర్గం	పురుషులు	స్త్రీలు	ట్రాన్స్‌జెండర్	మొత్తం
ఆసిఫాబాద్	1,13,815	1,15,813	16	2,29,644
సిర్పూర్	1,15,323	1,15,811	16	2,31,150

జూలై 1 నాటికి 18 ఏళ్లు నిండినవారు అర్హులు

వాంకిడి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఎన్నికల సంఘం ఓటరు నమోదును నిరంతర ప్రక్రియగా చేసింది. ఎన్నికల నోటిఫికేషన్ నాటికి కటాఫ్ తేదీని ఖరారు చేసి తుది ఓటరు జాబితాగా ప్రకటించనుంది. త్వరలోనే స్థానిక ఎన్నికలకు నగారా మోగనుంది. ఈ నేపథ్యంలో వీలైనంత త్వరగా యువత ఓటరుగా నమోదు చేసుకోవడమే మేలు. గతంలో ఓటర్ల నమోదుకు జనవరి 1తేదీ మాత్రమే ప్రామాణికంగా తీసుకునేవారు. సదరు తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన వారికి ఓటరుగా అర్హత లభించేది. సదరు విధానానికి స్వస్తి పలికారు. జనవరి 1, జూలై 1, అక్టోబరు 1, తేదీలను సైతం ప్రమా ణికంగా తీసుకోవాలని ఎన్నికల సంఘం నిర్ధేశించింది.

గుర్తింపు కార్డు పొందడం..

ఓటరు గుర్తింపు కార్డు కావాలనుకునేవారు వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. అందులో ఈ-ఎపిక్ కార్డు డౌన్‌లోడ్ అని కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేసి మొబైల్, ఎపిక్ కార్డు నంబర్ ఆధారంగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. గుర్తింపు కార్డుకు ఫోన్ నంబర్ అనుసంధానం అయితే ఓటీపీ వస్తుంది. లేకుంటే రాదు. ఫారం-8 ద్వారా ఫోన్ నంబర్ అనుసంధానం చేసుకోవచ్చు. తర్వాత గుర్తింపు కార్డును డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.

నమోదు ఇలా..

అరచేతిలోనే ఓటరుగా నమోదు చేసుకోవచ్చు. వెబ్‌సైట్‌లోకి వెళ్లాలి. పర్వీస్ పోర్టల్ కనిపిస్తుంది. దానిపై క్లిక్ చేయాలి. అందులో సెల్‌ఫోన్ నంబర్‌తో సెల్ఫ్ రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. అనంతరం లాగిన్ అవ్వాలి. ఆన్‌లైన్‌లో కొత్త ఓటుకు రిజిస్ట్రేషన్ చేసుకోవడం, తప్పులను సరిచేసుకోవడానికి, జాబితాలో రెండు ఓట్లు ఉంటే ఒకదాన్ని తొలగింపు, ఇతర అంశాలకు సంబంధించి వేర్వేరుగా ఫారం-6, ఫారం-7, ఫారం-8 కనిపిస్తాయి. వాటిలో మీకు కావాల్సిన దాని పై క్లిక్ చేసి అందులో పొందుపర్చాల్సిన వివరాలు నమోదు చేసి సబ్మిట్ చేయాలి. వివరాలు ఏఈఆర్వోకు వద్దకు వెళ్తాయి. పరిశీలించి ఆమోదిస్తారు. వెబ్‌సైట్ ద్వారా నమోదు చేసుకోలేని పరిస్థితుల్లో మీవద్ద ఉన్న మొబైల్‌లో హెచ్‌టీటీపీ: /// ఓటర్స్.ఈసీఐ.గౌట్. ఇన్ యాప్ డైన్‌లోడ్ చేసుకోవాలి. దానిపై క్లిక్ చేయగానే పోర్టల్ ఓపెన్ అవుతుంది. కొత్తగా ఓటు నమోదు చేసుకోవచ్చు. జాబితాలో పేరుందా లేదా చుసుకునే అవకాశం కల్పించారు.

ఏయే ఫారం ఎందుకంటే...

ఫారం-6 : కొత్తగా ఓటరు నమోదు చేసుకునేందుకు ఈ దరఖాస్తును పూరించాలి. ఒక ఫోటో వయసు నిర్ధారణ పత్రం(పదో తరగతి మెమో) చిరునామా ధ్రువీకరణ ఉండే కరెంట్ బిల్లు, నల్లా బిల్లు, ఇంటి పన్ను వంటి వాటిని జతచేయాలి.

ఫారం-6ఏ: విదేశాల్లో ఉన్న వారి కోసం ప్రత్యేకంగా ఫార్మాట్ రూపొందించారు. ఎన్నారైలకు రాష్ట్ర ఎన్నికల సంఘం 2018 నుంచి ఓటరుగా నమోదు చేసుకునేందుకు అవకాశం కల్పించింది.

ఫారం -7: ఓటరు జాబితాలో అభ్యంతరాలకు ఈ ఫారంను పూరించాల్సి ఉంటుంది. ఓటరు మరణించినా, ఇతర ప్రాంతాల్లో స్థిరపడ్డా వారిని జాబితా నుంచి తొలగించాలని ఈ ఫారం ద్వారా ఫిర్యాదు చేయవచ్చు

ఫారం-8: పట్టణాల్లో చాలామంది ఒక కాలనీ నుంచి మరో కాలనీకి మారుతుంటారు. ఈ క్రమంలో ఓటు వేసేటప్పుడు ఇబ్బందులు పడుతుంటారు. వారి కోసం ఈ ఫారం ఉపయోగపడుతుంది. ఒక పోలింగ్ బూత్ నుంచి మరో సమీప పోలింగ్ బూత్‌కు మారేందుకు దరఖాస్తు చేయాలి.

సందేహాలకు టోల్ ఫ్రీ నంబరు-1950

ఓటరు నమోదు, ఎన్నికలకు సంబంధించి 1950 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి సందేహాలను నివృత్తి చేసుకోవచ్చు. ఫిర్యాదు కూడా చేయొచ్చు. ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 6 గంటల వరకు సేవలు అందిస్తారు. అంతేకాకుండా ఇంటర్‌నెట్ నెంచి ఈమెయిల్ ద్వారా ఎన్నికల అధికారులకు ఫిర్యాదు చేయవచ్చు.

శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు



మాట్లాడుతున్న ఎస్పీ కాంతిలాల్ పాటిల్

బెజ్జూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): శాంతిభద్రతల పరిరక్షణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నామని జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ అన్నారు. మండల కేంద్రంలోని పోలీసు స్టేషన్‌ను బుధవారం ఎస్పీ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పోలీస్ స్టేషన్‌లోని రికార్డులను తనిఖీ చేసి స్టేషన్ పరిసరాలను పరిశీలించారు. పోలీస్ స్టేషన్‌లో కేసులకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రజలు ఇచ్చే ఫిర్యాదులను సత్వరమే పరిష్కారం చేసి తగిన న్యాయం చేయాలని సూచించారు. అదేవిధంగా మహారాష్ట్ర సరిహద్దుల్లో ఉన్న స్టేషన్ కావడంతో నిరంతరం అప్రమత్తంగా ఉండాలని పోలీసులను ఆదేశించారు. ఫిర్యాదుదారులతో స్నేహభావం కొనసాగిస్తూ ఉండాలని సూచించారు. ఆయన వెంట కాగజ్‌నగర్ డీఎస్పీ రామానుజం, కౌటాల సీఐ రమేష్, ఎస్సై ప్రవీణ్‌కుమార్, ఆర్ఎస్సై నవీన్ ఉన్నారు.

చింతలమానేపల్లి, (ఆంధ్రజ్యోతి): చింతలమానేపల్లి పోలీస్ స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కాంతిలాల్ పాటిల్ బుధవారం తనిఖీ చేశారు. సిబ్బందికి పలు సూచనలు చేశారు. పోలీస్ స్టేషన్ పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వివిధ సమస్యలతో పోలీస్ స్టేషన్‌కు వచ్చే బాధితులకు న్యాయం చేకూర్చే విధంగా బాధ్యతగా మెలగాలని సూచించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తుల పై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదైన కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్న కేసుల సత్వర పరిష్కారానికి కృషి చేయాలని సిబ్బందికి సూచించారు. సిబ్బంది, అధికారుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

అడవిపందుల దాడిలో వృద్ధుడికి గాయాలు



గుంపులుగా వెళుతున్న అడవిపందులు

లక్షెట్టిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): లక్షెట్టిపేట మండలం ఎల్లారం గ్రామంలో బుధవారం అడవి పందులు గుంపులుగా వచ్చి దాడి చేయ డంతో గ్రామానికి చెందిన మల్యాల లింగయ్య అనే వృద్ధుడు తీవ్ర గాయాలపాలయ్యాడు. స్థానికులు కట్టెలతో, బండరాళ్లతో కొడుతూ వాటిని తరిమేశారు. గాయపడ్డ లింగయ్యను లక్షెట్టిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తరలించారు. ఈ సందర్భంగా పలువురు గ్రామస్థులు మాట్లాడుతూ అడవి పందులు, కోతులతో పంట పొలాలు తీవ్రంగా దెబ్బతింటున్నాయని జనాలపైకి వచ్చి దాడిచేస్తు గాయపరుస్తున్నాయని వాపోయారు. అధికారులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

సరిపడా ఎరువులు అందజేయాలి

రెబ్బెన, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయాధికారులు రైతులకు సరిపడా ఎరువులు అందజేయాలని డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు చాపిడి పురుషోత్తం అన్నారు. స్థానికంగా బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యాపారులు, అధికారులు, ప్రజాప్రతినిధులు కుమ్మక్కై కృత్రిమ కొరత సృష్టిస్తున్నారని చెప్పారు. ఉన్నతాధికారులు స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. సమావేశంలో డీవైఎఫ్ఐ మండల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నెన్నెల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జోగాపూర్ మత్తడి వాగు బ్రిడ్జి సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని పెంటపాక గ్రామానికి చెందిన భోగె నవీన్ (23) అనే యువకుడు అక్కడిక్కడే మృతి చెందాడు. నెన్నెల ఎస్సై ప్రసాద్ తెలిపిన ప్రకారం .. రెండేళ్ల కిందట నెన్నెలకు చెందిన మాధురితో నవీన్‌కు వివాహం జరిగింది. తన 11 నెలల పాపకు ఆరోగ్యం బాగలేకపోవడంతో మాధురి 20 రోజుల కిందట తల్లిగారింటికి వచ్చింది. భార్య, పిల్లలను కలిసేందుకు వచ్చిన నవీన్ తిరిగి స్వగ్రామానికి వెళ్తుండగా బైక్ అదుపు తప్పి రోడ్డు పక్కనున్న సిమెంట్ స్థంభానికి ఢీకొని తీవ్రగాయాల పాలై మృతి చెందాడు. అటువైపుగా వెళ్తున్నవారు గమనించి బంధువులకు సమాచారం ఇచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై వివరించారు.

వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



మాట్లాడుతున్న జిల్లా వైద్యాధికారి సీతారాం

సిర్పూరు(టి), జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సీతారాం అన్నారు. మండల కేంద్రంలో బుధవారంఆర్ఎంపీ, పీఎంపీలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులను ప్రసవ సమయంలో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాలన్నారు. ఏవిధమైన ఆరోగ్య సమస్యలున్నా వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు. అత్యవసర వేళల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మందులిచ్చే విధానంపై ఆర్ఎంపీ, పీఎంపీలు ప్రాథమిక అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సిద్ధార్థ, సూపరింటెండెంట్ షఫీద్దీన్, రవిదాస్, శ్రీకాంత్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

ఎరువులు అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు



దుకాణంలో రికార్డులను పరిశీలిస్తున్న కలెక్టర్ వెంకటేష్ దోత్రే

వాంకిడి, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : రైతులకు ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. మండల కేంద్రంలో గల రాయల్ ఫర్టిలైజర్ దుకాణాన్ని బుధవారం కలెక్టర్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా స్టాకు రిజిస్టర్, నిల్వలను పరిశీలించారు. జిల్లాలో రైతుల వ్యవసాయ సాగుకు అవసరమైన ఎరువులు, విత్తనాలు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటా మన్నారు. దుకాణంలో ధరల పట్టిక, స్టాకు నిలువల పట్టికను షాపు ముందు ప్రదర్శిం చాలని చెప్పారు. యూరియా, డీఏపీ, ఇతర మందులను అధిక ధరలకు విక్రయించినట్లుగా ఫిర్యాదు అందితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామన్నారు. వ్యవసాయ శాఖ అధికారులు మండలంలోని ప్రతీ ఫర్టిలైజర్ దుకాణాన్ని తనిఖీ చేయాలన్నారు. స్టాకు, నిల్వల వివరాలను ప్రతి రోజు సమర్పించాలని సూచించారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు తీసుకోవాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలను సందర్శించారు. కళాశాల ఆవరణలో వనమహోత్సవ కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ఆయా శాఖలకు కేటాయించిన లక్ష్యాలను పూర్తి చేయాలని చెప్పారు. వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున మొక్కలు నాటేందుకు అనువైన వాతావరణం ఉందన్నారు. పెద్ద ఎత్తున మొక్కలు నాటి వాటిని సంరక్షించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ ఛైర్మన్ జాబిరే పెంటు, తహసీల్దార్ కవిత, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్, ఎంపీవో ఖాజా అజీజోద్దిన్, వ్యవసాయ అధికారి గోపికాంత్, గిర్దావార్ మాజీద్, కళాశాల ప్రిన్సిపాల్ చంద్రయ్య, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఒకరి బైండోవర్

తాండూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అచ్చలాపూర్ గ్రామానికి చెందిన సైదాం మధునయ్య అనే వ్యక్తిని తహసీల్దార్ ఎదుట బుధవారం బైండోవర్ చేసినట్లు ఎస్ఐ కిరణ్‌కుమార్ తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం.. మధునయ్య మద్యం మత్తులో ప్రతి రోజు అత్యవసర సేవ అయిన డయల్ 100కు ఫోన్ చేసి ఇబ్బందికి గురిచేస్తుండేవాడు. అతడిని పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి కౌన్సెలింగ్ ఇచ్చినా మార్పు రాకపోవడంతో మధునయ్యను బైండోవర్ చేయడం జరిగిందన్నారు. ఎవరైనా అనవసరంగా డయల్ 100కు ఫోన్ చేయవద్దని, ఆపద సమయంలో మాత్రమే సద్వినియోగం చేసుకో వాలన్నారు. లేకుంటే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

భోజనంలో మెనూ పాటించాలి

లింగాపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కస్తుర్బా విద్యాలయాల్లోని విద్యార్థులకు భోజనంలో మెనూ పాటించాలని మండల విద్యాధికారి ఎం శ్రీనివాస్ అన్నా రు. మండల కేంద్రంలోని కస్తుర్బాగాంధీ విద్యాలయంతో పాటు తరగతి గదులను పరిశీలించారు. పలు రికార్డులను తనిఖీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో మాట్లాడుతూ విద్యార్థులకు రుచికరమైన భోజన సదుపాయంతో పాటు నాణ్యమైన విద్యను అందించాలని సూచించారు. పాఠశాలల్లో విద్యార్థుల హాజరు శాతం పెంచాలని సూచించారు. ఈ విద్యాలయంలో ఇంటర్మీడియట్ సదుపాయాన్ని ప్రభుత్వం కల్పించినందుకుగానూ అడ్మిషన్ల ప్రక్రియ వేగవంతం చేయాలని సూచించారు. కార్యక్రమంలో ప్రత్యేక అధికారిణి ప్రసన్న భారతి, సీఆర్టీలు పాల్గొన్నారు.



జూలైలో నిర్ధేశిత బొగ్గు ఉత్పత్తి సాధించాలి

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఏరియాకు జూలై నెలలో నిర్ధేశించిన బొగ్గు ఉత్పత్తిని సాధించాలని శ్రీరాంపూర్ ఏరియా జీఎం ఎం శ్రీనివాస్ ఆదేశించారు. వివిధ కార్మిక సంఘాలు ఈ నెల 9వ తేదీన సమ్మె చేపడుతుండగా, బొగ్గు ఉత్పత్తిపై ప్రభావం పడకుండా తీసుకోవాల్సిన చర్యలు. జూన్ నెల ఉత్పతిపై ఆయన బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ప్రతి ఉద్యోగి సరైన ప్రణాళికతో ముందుకు సాగాలని సూచించారు. ప్రస్తుతం వర్షకాలం కావడంతో ఓసీపీలలో ఉత్పత్తి నిలిచిపోయే ప్రమాద ఉందని, వరద నీటిని ఎప్పటికప్పుడు బయటికి పంపేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. సమావేశంలో ఎస్ఓ టు జీఎం సత్యనారాయణ, ఏజెంట్లు రాజేందర్, శ్రీధర్, రవికుమార్, ఇందారం పీవో ఏవీరెడ్డి, శ్రీరాంపూర్ ఓసీపీ పీవో వెంకటేశ్వర్లు, డీజీఎం(పర్సనల్) అనిల్ కుమార్, డీజీఎం(ఫారెస్ట్) హరినారాయణ, సెక్యూరిటీ అధికారి జక్కారెడ్డి, ఎన్విరాన్‌మెంట్ అధికారి హన్మాన్‌గౌడ్, గనుల మేనేజర్లు, సంక్షేమాధికారులు పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

రెబ్బెన, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ నస్పూర్‌లోని పాలిటెక్నిక్ కళాశాలలో ప్రవేశాల కోసం సింగరేణి ఉద్యో గుల, విశ్రాంత ఉద్యోగుల పిల్లలు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలని అధికార ప్రతినిధి ఎస్‌వీ రాజేశ్వర్ రావు బుధవారం ఒక ప్రక టనలో తెలిపారు. మొత్తం సీట్లు 150 ఉన్నాయని పేర్కొన్నారు. అందులో ఎలక్ట్రికల్, ఎలక్ట్రానిక్స్ విభాగంలో 30, మెకానికల్ సీట్లు 30, సివిల్ సీట్లు 30, కంప్యూటర్ విభాగం సీట్లు 30, మైనింగ్ 30 సీట్లు భర్తీ చేస్తారని తెలిపారు. విద్యార్థులు గురువారం నుంచి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు డౌన్‌లోడ్ చేసుకొని మైన్ డిపార్టుమెంటు అధికారితో సంతకం చేయించాలని సూచించారు. 5న ఒరిజినల్స్‌తో పాటు మూడు సెట్ల జిరాక్స్‌తో సీసీసీ, నస్పూర్‌లోని కళాశాలకు హాజరు కావాలని తెలిపారు.

నాణ్యమైన బూట్లు అందజేయాలి

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కార్మికులకు నాణ్యమైన బూట్లు అందించాలని సీఐటీయూ ఏరియా అధ్యక్షుడు గుల్ల బాలాజీ బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నాసిరకమైన బూట్లు ఇవ్వడంతో కార్మికులు ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. బూట్లతో పాటుగా సాక్సులు ఇవ్వాల్సి ఉందని పేర్కొన్నారు. కానీ స్టాక్ లేదని, వస్తే ఇస్తామని దాటవేయడం సరికాదని తెలిపారు. యాజమాన్యం స్పందించి బాటా కంపెనీ బూట్లు, సాక్సులు ఇవ్వాలని కోరారు.

సమ్మెతో కేంద్రానికి గుణపాఠం చెప్పాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ రాష్ట్ర అధక్షుడు సీతారామయ్య

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): దేశవ్యాప్తంగా ఈ నెల 9న నిర్వహించే సమ్మె ను విజయవంతం చేసి, కేంద్ర ప్రభుత్వానికి గుణపాఠం చెప్పాలని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్య క్షుడు వి సీతారామయ్య అన్నారు. సింగరేణి కార్మిక సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో శ్రీరాంపూర్ ఓసీపీలో నిర్వహించిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. 44 లేబర్ చట్టాలను కుదించి నాలుగు లేబర్ కోడ్లుగా ఏర్పాటు చేయడం దారుణమన్నారు. ఆయా కోడ్లను వెంటనే రద్దు చేయాలని కోరుతూ ఈ నెల 9వ తేదీన్ని అన్నికార్మిక సంఘాల ఆధ్వర్యంలో సమ్మె నిర్వహించనున్నామని, కార్మికులు విజయ వం తం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీ యూసీ ఉప ప్రధాన కార్యదర్శి కందికట్ల వీరభ ద్రయ్య, బ్రాంచ్ కార్యదర్శి ఎస్‌కే బాజీసైదా, ఐఎన్‌టీయూసీ ప్రధాన కార్యదర్శి ఏనుగు రవీందర్ రెడ్డి, ఉపాధ్యక్షులు జెట్టి శంకర్ రావు, జీవన్ జోయల్, సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు తుమ్మల రాజారెడ్డి, నాయకుడు చంద్రశేఖర్, టీబీజీకేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు మిర్యాల రాజిరెడ్డి, ప్రధాన కార్యదర్శి కేతిరెడ్డి సురేందర్‌రెడ్డి, శ్రీరాం పూర్ ఏరియా ఉపాధ్యక్షుడు బండి రమేశ్, ఐఎఫ్‌టీయూ రాష్ట్ర అధ్యక్షుడు విశ్వనాథం పాల్గొన్నారు.

పదోన్నతిపై వెళ్తున్న మేనేజర్‌కు సన్మానం

కాసిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మందమర్రి డివిజన్ పరిధిలోని కాసిపేట గనిలో మేనేజర్‌గా పని చేసి ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా పదోన్నతిపై వెళ్తున్న భూ శంకరయ్యను కార్మిక సంఘాల నాయకులు, అధికారులు బుధవారం సన్మానించారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ సెంట్రల్ కమిటీ నాయకులు చిప్ప నర్సయ్య, బెల్లంపల్లి ఏరియా బ్రాంచి కార్యదర్శి దాగాం మల్లేశ్, పిట్ సెక్రటరీ మీనుగు లక్ష్మీనారాయణ, ఐఎన్‌టీయుసీ సెంట్రల్ ఆర్గనైజింగ్ కార్యదర్శి బన్న లక్ష్మణ్‌దాసు, పిట్ సెక్రటరీ రవీందర్, టీబీజీకేఎస్ నాయకులు బైరి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

కాసిపేట గని మేనేజర్‌గా బాధ్యతల స్వీకరణ

కాసిపేట, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కాసిపేట గని మేనేజర్‌గా సత్తయ్య బుధవారం బాధ్యతలు స్వీకరించారు. కాసిపేట గని మేనేజర్‌గా పని చేసిన భూ శంకరయ్య పదోన్నతిపై మందమర్రి ఏరియా సేఫ్టీ ఆఫీసర్‌గా వెళ్లారు. ఇందారం ఓసీలో పని చేసిన సత్తయ్య పదోన్నతిపై కాసిపేట గని మేనేజర్‌గా బాధ్యతలు స్వీకరించారు.

కార్మిక చట్టాలను కాలరాసే కుట్రను తిప్పికొడుతాం

మందమర్రి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక చట్టాలను కాలరాసే కుట్రలు చేస్తే తిప్పికొడుతామని కార్మిక జేఏసీ నాయకులు వాసిరెడ్డి సీతారామయ్య, కాంపెల్లి సమ్మయ్య, నాగరాజు గోపాల్‌లు అన్నారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. బ్రిటీష్ కాలం నాటి 44 కార్మిక చట్టాలను కార్మిక సంఘాలన్నీ కాపాడుకుంటూ వస్తే కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్‌లుగా చేయడానికి నిర్ణయం తీసుకోవడం సరికాదన్నారు. లేబర్‌కోడ్‌లు అంటేనే కార్మిక సంఘాల మనుగడను కార్మిక సంక్షేమం, హక్కులను విస్మరించడమే అన్నారు. ఈనెల 9న చేపటిన దేశ వ్యాప్త సమ్మెకు సంబంధించి సింగరేణి వ్యాప్తంగా సభలు, సమావేశాలు నిర్వహించబోతున్నామని తెలిపారు. సమ్మెలో పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొని విజయవంతం చేయాలన్నారు. సమావేశంలో కార్మిక సంఘాల జేఏసీ నాయకులు మేడిపల్లి సంపత్, రాములు, సలేంద్ర సత్యనారాయణ, దాగాం మల్లేశ్, భీమనాథుని సుదర్శన్, సీవీ రమణ, పెద్దపల్లి భానయ్య, ముల్కలపల్లి వెంకటేశ్వర్లు, దార భిక్షపతి, రామగిరి రామస్వామి, ఐలయ్య, వీరరెడ్డి, తిరుపతి, తదితరులు పాల్గొన్నారు.



మాటాడుతున్న కార్మిక సంఘాల నాయకులు

నాలుగు లేబర్ కోడ్‌లను రద్దు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి) : గతంలో కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను కేంద్ర ప్రభుత్వం 4 లేబర్ కోడ్‌లను మార్చి అమలు చేయాలని చూస్తోందని, వాటిని వెంటనే రద్దు చేయాలని హెచ్‌ఎంఎస్, ఐఎఫ్‌టీయూ, సింగరేణి ఉద్యోగుల సంఘం, ఏఐఎఫ్‌టీయూ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ఆర్‌కే 5 గనిపై బుధవారం నిర్వహించిన గేట్ మీటింగ్‌లో వారు మాట్లాడారు. కేంద్రం విధానాలన నిరసిస్తూ ఈ నెల 9వ తేదీన దేశవ్యాప్తంగా నిర్వహించే సమ్మెలో సింగరేణి కార్మికులు పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో హెచ్‌ఎంఎస్ కేంద్ర కమిటీ నాయకుడు సారయ్య, ఐఎఫ్‌టీయూ జాతీయ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, నాయకులు బ్రహ్మానందం, రాములు, తదితరులు పాల్గొన్నారు.

మెడికల్‌బోర్డు ఏర్పాటు చేయాలి

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మూడు నెలలుగా ఆగిపోయిన మెడికల్ బోర్డు ను వెంటనే ఏర్పాటు చేయాలని హెచ్‌ఎంఎస్ కేంద్ర నాయకుడు తిప్పారపు సారయ్య బుధవారం ఒక ప్రకటనలో కోరారు. నూతన సీఎంఓ కిరణ్ రాజ్ కుమార్ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి ఇప్పటి వరకు మెడికల్ బోర్డు ఏర్పాటు చేయక పోవడం శోచనీయమని తెలిపారు.

నాణ్యమైన భోజనం అందించాలి



వంటలను తనిఖీ చేస్తున్న ఎంపీడీవో ఉమర్ షరీఫ్

జన్నారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందించాలని ఎంపీడీవో ఉమర్ షరీఫ్ సూచించారు. బుధవారం మండలంలోని గిరిజన ఆశ్రమ పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈసందర్భంగా వండే వంటకాలతో పాటు నిల్వ ఉంచిన కూరగాయలను పరిశీలించారు. కూరగాయలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుతూ తాజా కూరగాయాలను తీసుకురావాలని సూచించారు. పరిసరాలు ఎల్లప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఆర్‌వో ప్లాంట్‌ను పరిశీలించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశం ఉందని విద్యార్థులు జాగ్రత్తగా ఉండాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ ఈవో రాహుల్, పాఠశాల సిబ్బంది ఉన్నారు.

బీసీ రిజర్వేషన్ల కోసం పోరాడాలి

జన్నారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బీసీ రిజర్వేషన్ల సాధనకోసం పోరాడాలని బీసీ మహిళ సంఘం నాయకురాలు పోడూరి లీలావతి ప్రజాపతి బుధవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లు 42శాతం కల్పిస్తామని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డి డిక్లరేషన్‌లో ప్రకటించిందన్నారు. స్థానిక ఎన్నికలను మూడు నెలల్లోగా పూర్తి చేయాలని హైకోర్టు తీర్పు ఇచ్చిందన్నారు. స్థానిక ఎన్నికలపై కాంగ్రెస్ ప్రభుత్వానికి కనీసం చీమకుట్టినట్టుకూడాలేదన్నారు. 42 శాతం రిజర్వేషన్లు కల్పించకపోతే ఊరుకునేది లేదని హెచ్చరించారు.


ఏపీవోకు సన్మానం

మందమర్రిరూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మందమర్రి మండలంలో ఈజీఎస్ ఏపీవోగా పనిచేస్తున్న రజియా సుల్తానా సోషల్ వర్క్ అనే అంశంపై నిర్వహించిన పరిశోధనకు గాను ఇటీవల హైద్రాబాద్‌లోని పొట్టి శ్రీరాములు విశ్వవిద్యాలయం డాక్టరేట్ అందించింది. బుధవారం ఎంపీడీవో కార్యాలయంలో ఏపీవోను ఎంపీడీవో రాజేశ్వర్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో చిత్రకుంట మాజీ సర్పంచు ఒడ్నాల కొమురయ్య, గందె రాంచందర్, ఎంపీవో సత్యనారాయణ, ఏపీఎం లలితకుమారి, ఈసీ మధు, టీఏ రాజమల్లు, కుమార్, తిరుమల, ఫీల్డ్ అసిసెంట్‌లు ఈద లింగయ్య, సత్యనారాయణ, రాజేందర్ పాల్గొన్నారు.

వాసవి క్లబ్ ఆధ్వర్యంలో సన్మానం

మంచిర్యాలక్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జాతీయ వైద్యులు, చార్టర్డ్ అకౌంటెంట్ల దినోత్సవం సందర్భంగా మంచిర్యాల వాసవి క్లబ్ ఆధ్వర్యంలో చార్టర్డ్ అకౌంటెంట్, వైద్యులను ఘనంగా సన్మానించారు. వాసవి క్లబ్, వనిత క్లబ్, కపుల్స్ క్లబ్, టీచర్స్ క్లబ్, బీజోన్ క్లబ్ బాధ్యులు సంయుక్తంగా సత్కరించారు. కార్యక్రమంలో సాయి ప్రణీత్, డాక్టర్ నల్మాస్ శ్రీదేవి, తాటిపెల్లి శ్రీధర్, జైన్ రామకృష్ణ, జైన్ సరిత, గోలిపూర్ణచందర్, రావికంటి వంశీక్రిష్ణ, క్లబ్ సభ్యులు దొంతుల ముకేశ్, కేశెట్టి వంశీక్రిష్ణ, నల్మాస్ ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

జలాన్ని ఒడిసిపట్టుదాం..



- గ్రామాల్లో జోరుగా ఇంకుడు గుంతల నిర్మాణాలు
- భూగర్భ జలాల అభివృద్ధికి అధికారుల కృషి
- సద్వినియోగం చేసుకుంటున్న ప్రజలు
- జిల్లాలో పర్యటిస్తున్న జలశక్తి కేంద్ర బృందం సభ్యులు



ఇంటి ఆవరణలో నిర్మించుకున్న ఇంకుడు గుంత

బెల్లంపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): భూమిపై ఉన్న ప్రాణకోటికి నీరే జీవనాధారం. అలాంటి నీటిని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలపై ఉంది. ప్రతీ ఇంటిలో నిత్యం దైనందిన కార్యక్రమాలు అవసరాలు ఉపయోగించే నీటికన్నా వృధాగాపోయే నీరే ఎక్కువ. ఈ క్రమంలో వృథానీటిని ఒడిసిపట్టేందుకు ప్రతీ నీటి బొట్టును ఇంకించి భూగర్భ జలాలను పెంచాలనే లక్ష్యంగా ప్రతీఇంటిలో ఇంకుడు గుంతలు నిర్మించడమే ప్రధాన లక్ష్యంగా మహాత్మగాంధీ జాతీయ ఉపాధిహామీ పథకం నిధులతో ఇంకుడు గుంతల నిర్మాణం చేపడుతున్నారు. ప్రభుత్వం నుంచి ఇంకుడు గుంతలు నిర్మించుకున్నవారికి ఆర్థికసాయం అందుతుండడంతో ప్రజలు సద్వినియోగం చేసుకుంటున్నారు. ప్రభుత్వం ప్రోత్సాహంతో గ్రామాల్లో ఇంకుడు గుంతల నిర్మాణాలు జోరుగాసాగుతున్నాయి. ఇటీవల జిల్లాలో జలశక్తి అభియాన్ కేంద్ర బృందం పర్యటిస్తూ ఇంకుడు గుంతలను పరిశీలిస్తోంది.

జిల్లా వ్యాప్తంగా 80వేల ఇంకుడు గుంతల నిర్మాణం..

జిల్లాలోని పలు గ్రామాల్లో భూగర్భలాలు పెంచేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపడుతున్నారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం జలశక్తి అభియాన్ కార్యక్రమాన్ని చేపట్టింది. జిల్లా అధికారులు జిల్లాలో నిర్మించిన ఇంకుడు గుంతల పనులను 80 వేలకు పైగా ఆన్‌లైన్‌లో నమోదు చేసి మూడో స్థానంలో నిలిచారు. దీనిని పరిశీలించిన కేంద్ర ప్రభుత్వం క్షేత్రస్థాయి అధికారులను జిల్లాలో పర్యటించాలని ఆదేశాలివ్వడంతో ఇంకుడు గుంతల నిర్మాణ పనులను కేంద్ర భూగర్భ నీటి శాస్త్రవేత్తలతో పాటు ఇతర అధికారులు పనులను పర్యవేక్షిస్తున్నారు.

ఈ పనులన్నీ సక్రమంగా చేసినట్లు నమోదైతే జిల్లాకు మంచి గుర్తింపు రానుంది. జిల్లాలో నీటి సంరక్షణ కోసం ఇంకుడు గుంతలు, ఫిష్ పాండ్స్, నీటి కుంటలు, ఫారం పాండ్స్, రూఫ్‌టాప్, రేయిన్‌వాటర్ హార్వెస్టింగ్ ఇంకుడు గుంతలు, సామూహిక ఇంకుడు



నీటి కుంటను పరిశీలిస్తున్న అధికారులు

గుంతలు, చెక్‌డ్యాంల వంటివి జిల్లావ్యాప్తంగా పలు మండలాల్లో సంబంధిత అధికారులు ప్రజలకు, అధికారులకు అవగాహన కల్పించి దాదాపు 80వేలు పూర్తి చేశారు.

ఇంకుడు గుంతల నిర్మాణం ఇలా...

ప్రతి ఇంకుడు గుంత 1.2మీటర్ల పొడవు, 1.2 మీటర్ల వెడల్పు, 1.8 మీటర్ల లోతు కలిగి ఉంటుంది. అడుగు భాగంలో పీటున్నర మందం బెండదు రాళ్లు, దానిపై 40ఎంఎం పీటున్నర కంకర, వాటిపైన 3ఫీట్ల రింగును అమర్చుతున్నారు. దీనిపై మూత ఏర్పాటు చేసి ఐదు మీటర్ల పైపును బిగిస్తున్నారు. ఇరుపక్కల 20ఎంఎం కంకర నింపుతూ మొదట గుంత తవ్వగా వచ్చిన మట్టిని నీటి ప్రవాహానికి అడ్డంగా పోస్తున్నారు. ప్రతి ఇంకుడు గుంతకు ప్రభుత్వం నుంచి ఆరు వేల రూపాయల నుంచి ఏడు వేల రూపాయలను అందిస్తోంది.

భూగర్భజలం పెరుగుతుంది..

జిల్లా గ్రామీణ అభివృద్ధిశాఖ అధికారి కిషన్

కలెక్టర్ ఆదేశాల మేరకు జిల్లా వ్యాప్తంగా ఇంకుడుగుంతల నిర్మాణ పనులను నాణ్యంగా చేపట్టాం. నిర్మిస్తున్న ఇంకుడుగుంతలతో భూగర్భజలం పెరుగుతుంది. ఇంకుడు గుంతల నిర్మాణం చేపడితే భవిష్యత్‌లో భూగర్భజలాల అభివృద్ధికి తోడ్పడుతుంది. ఇంకుడు గుంతల నిర్మాణంపై ప్రజలకు ఎప్పకప్పుడు అవగాహన కల్పిస్తున్నాం.

నిధులు గోల్‌మాల్

- మంచిర్యాల క్లబ్‌లో రూ. మూడు కోట్ల మేర మాయమైన నగదు

(5వపేజీ తరువాయి)

పేకాట రాయుళ్ల పందెం కాస్తుంటారు. ప్రతీరోజు దాదాపు 100 మంది వరకు ఇక్కడ పేకాట ఆడుతుంటారు. వీటికి అదనంగా క్లబ్ నిర్వాహకులు సభ్యులకు రిక్రియేషన్ టూర్లు ఏర్పాటు చేస్తుంటారు. సాయంత్రం వేళ వందలాది మంది పేకాట కోసం ఇక్కడికి వస్తుంటారని సమాచారం. అయితే నేరుగా డబ్బులు టేబుల్‌పై ఉంచకుండా కాయిన్‌లు ఉపయోగిస్తూ గేమ్ ఆడుతుంటారు.

● పోలీసుల దాడుల్లో పట్టుబడ్డ పేకాట రాయుళ్లు...

రామగుండం కమిషనరేట్ పోలీసులు 2019 జూన్ 3న మంచిర్యాల క్లబ్‌పై దాడులు నిర్వహించి, పేకాట ఆడుతున్న 36 మందిని అరెస్టు చేశారు. దాడుల సందర్భంగా పేకాట రాయుళ్ల నుంచి పోలీసులు 237 కాయిన్‌లతోపాటు రూ. 6.21 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. దీంతో అక్రమంగా సాగుతున్న పేకాట బాగోతం బట్టబయలైంది. ఇలా పలుమార్లు క్లబ్‌పై పోలీసుల దాడులు జరుగగా, కొంతకాలం తరువాత మళ్లీ తమ కార్యకలాపాలు కొనసాగించడం ఆనవాయి తీగా వస్తోంది. కరోనా సమయంలో కొంతకాలంపాటు క్లబ్‌లో కార్యకలాపాలు నిలిచిపోగా, మళ్లీ ఊపందుకున్నాయి.

● రూ. మూడు కోట్లు పక్కదారి..

మంచిర్యాల క్లబ్ నిర్వహణకు ప్రత్యేక కమిటీ ఉంటుంది. ఈకమిటీ ఆధ్వర్యంలోనే వివిధ కార్యకలాపాలు కొనసాగుతుంటాయి. గతంలో ఐబీ సమీపంలో ఉన్న క్లబ్‌ను 15 సంవత్సరాల క్రితం హైటెక్‌సిటీలోని నూతన భవనంలోకి మార్చారు. అప్పటి నుంచి సభ్యత్వం తీసుకునే వారి సంఖ్య క్రమేపీ పెరిగింది. క్లబ్ పేరిట బ్యాంకుల్లో డిపాజిట్లు కూడా పెరిగాయి. దాదాపు మూడు కోట్ల రూపాయల పై చిలుకు నిధులు క్లబ్‌పేరిట బ్యాంకుల్లో జమ అయ్యాయి. అయితే ఎప్పటికప్పుడు నూతన కమిటీని ఎన్నుకోవలసి ఉండగా, దశాబ్దకాలం పాటు అదే కమిటీని కొనసాగించారు. ఆసమయంలో కమిటీ సభ్యులది ఆడిందే ఆటగా తయారైంది. కాలక్రమేణా బ్యాంకుల్లో నిల్వ ఉన్న నగదు మొత్తం మాయమైంది. ప్రస్తుతం క్లబ్ పేరిట చిల్లగవ్వ కూడా లేదని సమాచారం. సాధారణంగా టూర్‌ల సమయంలో సభ్యులు 40 శాతం, క్లబ్ నుంచి 60 శాతం ఖర్చులు వెచ్చిస్తుంటారు. డబ్బులు లేకపోవడంతో నాలుగైదు సంవత్సరాలుగా టూర్‌లు బంద్ చేసినట్లు తెలుస్తోంది. ఇదిలా ఉండగా, ఈ మధ్యకాలంలో హైద్రాబాద్‌లో ఉన్న పలు క్లబ్‌లతో మంచిర్యాల క్లబ్‌ను అనుసంధానం కూడా చేసినట్లు తెలిసింది. తద్వారా మంచిర్యాల క్లబ్ సభ్యులకు హైద్రాబాద్‌కు వెళ్లి కూడా పేకాట ఆడే వెసులుబాటును నిర్వాహకులు కల్పించారు. క్లబ్‌లో నిధుల గోల్‌మాల్ విషయమై జోరుగా చర్చ జరుగుతుండటం, మూడు రోజుల క్రితం స్థానిక ఎమ్మెల్యే ప్రేంసాగర్‌రావు క్లబ్‌లో గోల్‌మాల్ అయిన నిధులను కక్కిస్తాని బాహాటంగా హెచ్చరించడంతో ఈ అంశం తీవ్ర చర్చనీయాంశం అవుతోంది.

'పథకం ప్రకారమే అనర్హులకు షట్టర్లు'

బెల్లంపల్లి, జూలై 2(ఆంధ్రజ్యోతి): కూరగాయల మార్కెట్ షట్టర్లను అనర్హులకు కేటాయించిన అప్పటి మున్సిపల్ కమిషనర్ శ్రీనివాస్, బిల్‌కలెక్టర్ విజయ్‌ను సస్పెండ్ చేయాలని ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కోడి రమేశ్ డిమాండ్ చేశారు. బుధవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ కూరగాయల మార్కెట్ల షట్టర్ల విషయంలో మున్సిపల్ కమిషనర్, బిల్ కలెక్టర్ ముందస్తు పథకం ప్రకారం అనర్హులకు కేటాయించారన్నారు. గతంలో మార్కెట్‌లో ఎవరైతే వ్యాపారం నిర్వహించారో వారికే షట్టర్లను కేటాయిం చాలని డిమాండ్ చేశారు. డ్రా తీస్తున్న సమయంలో కమిషనర్, బిల్ కలెక్టర్లు అవినీతికి పాల్పడ్డారని ఈ విషయంపై ఉన్నతాధికారులు విచారణ చేపట్టి చట్టపరమైన చర్యలు తీసుకొని సస్పెండ్ చేయాలని కోరారు.

ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలి

మంచిర్యాలక్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రైవేటు పాఠశాలల దోపిడీని అరికట్టాలని బీసీ విద్యార్థి సంఘం నాయకుడు నితీష్ అన్నారు. ఆయన బుధవారం విలేకరులతో మాట్లాడారు. కొన్ని పాఠశాల యాజమాన్యాలు నిబంధనలను బేఖాతరు చేస్తూ ఇష్టానుసారంగా ఫీజులు వసూలు చేస్తున్నారని అన్నారు. లక్షల్లో దోచుకుంటూ కనీస వసతులు కూడా కల్పించడం లేదన్నారు. పాఠశాలల్లో పుస్తకాలు అమ్ముతూ వ్యాపారం చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో మాదిగ స్టూడెంట్ ఫోరం జిల్లా అధ్యక్షులు వడ్లకొండ సంజయ్, నాయకులు అజయ్, శరత్, వినయ్ పాల్గొన్నారు.

సమ్మె నోటీసు అందజేత

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): ఈ నెల 9న జరిగే దేశ వ్యాప్త సమ్మెలో పాల్గొంటున్నామని పేర్కొంటూ ఐకేపీ వీవోఏ యూనియన్ నాయకులు సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం డీఆర్‌డీవో కార్యాలయం ఏవో అబ్దుల్ సలీమ్‌కు సమ్మె నోటీసు అందించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి రంజిత్‌కుమార్ మాట్లాడుతూ సమ్మెలో కార్మికులు, వర్కర్లు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు కుమార్, రాములు, పద్మ పాల్గొన్నారు.

బీసీ వసతి గృహంలో ప్రవేశాలకు ఆహ్వానం

దండేపల్లి జూలై 2 (ఆంధ్రజ్యోతి): దండేపల్లి మండల కేంద్రంలో బీసీ బాలుర వసతి గృహంలో ప్రవేశాలు పొందేందుకు వెనుకబడి విద్యార్థుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని బీసీ వసతి గృహ సంక్షేమ అధికారి మనోజ్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. బీసీవసతి గృహంలో మూడో తరగతి నుంచి 10వ తరగతి వరకు 85 సీట్లు ఖాళీగా ఉన్నాయన్నారు. బీసీ వసతి గృహంలో ఉండే విద్యార్థులకు ప్రభుత్వ మెను ప్రకారం పౌష్టికారాన్ని అందిస్తామన్నారు. ఆసక్తి గల విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలన్నారు.

మొక్కలు నాటుదాం.. పర్యావరణాన్ని కాపాడుదాం

దండేపలి జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రతీ ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు పాటుపడుదామని గూడెం సత్యనారాయణస్వామి దేవస్థానం కార్యనిర్వహణాధికారి సంకటాల శ్రీనివాస్ అన్నారు. వనమహోత్సం కార్యక్రమంలో భాగంగా బుధవారం దండేపల్లి మండలం గూడెం సత్యనారాయణస్వామి ఆలయ ప్రాంగణంలో ఆలయ అర్చకులు, సిబ్బందితో కలిసి ఈవో మామిడి, రావి, ఉసిరి, మారేడు మొక్కలను నాటారు. కార్యక్రమంలో ఆలయ ముఖ్య అర్చకుడు గోవర్ధన రాఘుస్వామి, సీనియర్ అసిస్టెంటు చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్య శిబిరం

నస్పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సీసీసీ-శ్రీరాంపూర్ లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరంలో 60 మందికి పరీక్షలు చేశారు. ఇందులో 22 మందికి కంటి ఆపరేషన్లు అవసరమని గుర్తించారు. వీరిని గురువారం కరీంనగర్‌లోని రేకూర్తి కంటి అసుపత్రికి తరలించి ఆపరేషన్లు చే పిస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో కంటి వైద్య నిపుణులు సుగుణాకర్ రెడ్డి, అభిషేక్, లయన్స్ క్లబ్ అధ్యక్షుడు రేగుంట చంద్రశేఖర్, లయన్స్ సభ్యులు పాల్గొన్నారు.

పాలిటెక్నిక్ విద్యార్థులకు డ్రగ్స్‌పై అవగాహన



సమావేశంలో మాట్లాడుతున్న షీ టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నరేష్

నస్పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): నస్పూర్ పట్టణం సీసీసీలోని సింగరేణి పాలిటెక్నిక్ కళాశాల విద్యార్థులకు బుధవారం మహిళల భద్రత, డ్రగ్స్‌పై అవగాహన కల్పిం చారు. అలాగే షీ టీం ప్రాధాన్యం, డ్రగ్స్ వలన కలిగే అనర్థాలు, నష్టాలు, బాల్యవివాహాలు, ఈవ్ టీజింగ్, మానవ అక్రమ రవాణ, పోక్సో చట్టాల గురించి వివరించారు. ఈ సందర్భంగా మంచిర్యాల జిల్లా షీ టీం ఇన్‌చార్జి ఇన్‌స్పెక్టర్ నరేష్ మాట్లాడుతూ మత్తు పదార్థా ల వినియోగం కారణంగా అనేక నష్టాలు ఉన్నాయని, వాటికి దూరంగా ఉండాలని సూచించారు. మహిళల, పిల్లల రక్షణకు చట్టాలు ఉన్నయన్నారు. ఏదైనా ఇబ్బంది ఎదురైనా 100 నంబర్‌కు డయల్ చేయాలన్నారు. ఈ అవగాహన కార్యక్రమంలో సీ టీమ్ ఎస్‌ఐలు హైమా, ఉమారాణి, కానిస్టేబుల్స్ జ్యోతి, శ్రీలత, భరోసా కేంద్రం కో ఆర్డినేటర్ విజయ, జిల్లా న్యాయ సేవాసమితి సభ్యులు శ్రీనివాస్, రాములు, సదయ్య, కళాశాల అధ్యాపకబృందం, విద్యార్థులు పాల్గొన్నారు.

మున్సిపాలిటిలోని సమస్యలు పరిష్కరించాలి

బెల్లంపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలోని పలు వార్డుల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని మున్సిపల్ కమిషనర్‌కు సీపీఐ నా యకులు బుధవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడె చిప్ప నర్సయ్య, పట్టణ కార్యదర్శి రాజమౌళి మాట్లాడుతూ పలు వార్డుల్లో రహదారులు బాగాలేక వాహనదారులు ఇబ్బం దులు ఎదుర్కొంటున్నారన్నారు. ప్రతీరోజు మంచినీరు సరఫరా చేయకపోవడంతో తాగునీటి సమస్య ఎదురవుతుందని పేర్కొన్నారు. బజార్ ఏరియాలో వాహనదారులకు పార్కింగ్ స్థలం లేకపోవడంతో వ్యాపారస్థులు వాహనదా రులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. వెంటనే పార్కింగ్ స్థలం కేటాయించాలని డిమాండ్ చేశారు. బజార్ ఏరియాలోని పలు వీధుల్లో అక్రమ నిర్మాణాలను తొలగించాలని, రహదారులు వెడల్పు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మున్సిపల్ కమిషనర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు తిలక్ అంబేద్కర్, రత్నం రాజ్యం, రాంచందర్, శంకర్, రాజమల్లు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ గృహాలకు భూమి పూజ

మంచిర్యాలక్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌లో ఇందిరమ్మ గృహాలకు మున్సిపల్ మాజీ చైర్మన్ డాక్టర్ ఉప్పలయ్య బుధవారం భూమి పూజ నిర్వహించారు. కార్యక్రమంలో నాయకులు నజీర్ హుస్సేన్, అబ్దుల్ జలీల్, అబ్దుల్ మన్నన్, శ్యాంసుందర్ రెడ్డి, రజియాబేగం, రంగ సునీత, ఏఈ రాణి, అధికారులు శ్రీనాథ్, పాల్గొన్నారు.

ఇరువర్గాల దాడి.. పలువురికి గాయాలు

మంచిర్యాలక్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): పందుల పంచాయితీలో ఒకవర్గంపై మరొక వర్గం దాడి ఘటనలో పలువురికి గా యాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మంచిర్యాల పట్టణం జాఫర్‌నగర్‌కు చెందిన సింద్యాల శివకు చెందిన ఐదు పందులు శనివారం కనిపించకుండాపోయాయి. దీంతో శివ పందుల కోసం గాలిస్తుండగా హైటెక్ సమీపంలో రెండు పందులను గుర్తించాడు. అవి తనయేనని అడగడంతో హైటెక్‌సిటీ సమీపంలో పెద్దమనుషుల సమక్షంలో పంచాయితీ నిర్వహించారు. దీంతో పంచాయితీ నడుస్తుండగానే ఒకరిపై ఒకరు దాడికి పాల్పడ్డారు. పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేసినట్లు సమాచారం.

ప్రజాఫ్రంట్ పేరుతో వెలిసిన పోస్టర్లు

వేమనపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలో మంగళవారం రాత్రి మావోయిస్టు ఆత్మ పరిరక్షణ ప్రజాఫ్రంట్ పేరుతో వాల్ పోస్టర్లు వెలిశాయి. సమాచారం అందుకున్న నీల్వాయి ఎస్‌ఐ శ్యామ్‌పటేల్ బుధవారం పోస్టర్లను పరిశీలించారు. ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు పోస్టర్లను అంటించినట్లు తెలుస్తుంది. మండలంలోని ముక్కిడిగూడెం, జాజులపేట, కల్లెంపల్లి గ్రామాల్లో కల్వర్టులకు, మిషన్ భగీరథ గేట్ వాల్‌కు పోస్టర్లను అంటించారు. 'ఆయుధాలు వీడండి జనజీవన స్రవంతిలోకి రండి.. మీ మేధస్సును, ప్రజల అభివృద్ధికి ఉపయోగించండి' అంటూ పోస్టర్లలో ఉంది. పోస్టర్ల విషయాన్ని స్థానికులను ఎస్‌ఐ అడిగి తెలుసుకున్నారు.

'తప్పుడు కేసుపెట్టి ఇబ్బంది పెడుతున్నారు'

నస్పూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తనను కాంగ్రెస్ నాయకులు తప్పుడు కేసుల్లో ఇరికించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని బీఆర్‌ఎస్ నాయకుడు, మాజీ కౌన్సిలర్ బేర సత్యనారాయణ అన్నారు. నస్పూర్ ప్రెస్‌క్లబ్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తాను ఎవరి భూములు కబ్జా చేయలేదన్నారు. కొందరు కావాలని మున్సిపల్ కమిషనర్‌తో కేసులు పెట్టించారన్నారు. దేవాలయ భూమిని అక్రమ రిజిస్ట్రేషన్ చేయించుకున్న కాంగ్రెస్ నాయకుడిపై ఎందుకు చర్యలు తీసుకోవడంలేదని ప్రశ్నించారు. సమావేశంలో బీఆర్‌ఎస్ నాయకులు మేడం తిరుపతి, వంగ తిరుపతి, మెరుగు పవన్ కుమార్, రవి గౌడ్, నరేందర్, కందుల ప్రశాంత్, బండారి తిరుపతి, తోట దుర్గ ప్రసాద్, జక్కుల కుమార్, అరుణ్, భీమయ్య తదితరులు పాల్గొన్నారు.

వర్షాకాలంలో వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

- జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్



మాట్లాడుతున్న హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్

మందమర్రి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో వ్యాప్తి చెందే వ్యాధులపై విద్యార్థులు అవగాహన కలిగి ఉండాలని జిల్లా హెల్త్ ఎడ్యూకేటర్ అల్లాడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం పట్టణంలోని మహాత్మ జ్యోతిబాపూలే బీసీ సంక్షేమ గురురుకుల పాఠశాలతో పాటు కళాశాలల్లో కీటకజనిత వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమానికి అల్లాడి శ్రీనివాస్ హాజరై మాట్లాడారు. ప్రధానంగా వర్షాకాలంలో మలేరియా, చికెన్ గున్యా, డెంగ్యూ, మెదుడువాపు వ్యాధులు వస్తాయని తెలిపారు. ఎనాఫీలీస్ ఆడదోమవల్ల మలేరియా వ్యాధి సోకుతుందని చలి జ్వరం ముఖ్య లక్షణమని పేర్కొన్నారు. మురికినీటిలో అభివృద్ధి చెందే క్యూలెక్స్ దోమ ద్వారా బోధకాలు, మెదడువాపు వ్యాధు లు సంక్రమిస్తాయని తెలిపారు. ఏడీఎస్ దోమ ద్వారా డెంగ్యూ వ్యాధి వస్తుందన్నారు. తమనివాసాల్లో కూలర్ల నీటితో పాటు కొబ్బరిబోండాలు, నీళ్ల ట్యాంక్‌లు, కుండపెంకులు పడేసిన టైలర్లలో నీరు నిల్వ ఉంటే వెంటనే వ్యాప్తి చెందుతాయన్నారు. మురికికాలువ ల్లో నీటి గుంతల్లో ఆయిల్‌బాల్స్ వేసి దోమల అభివృద్ధిని అరికట్టవచ్చని పేర్కొన్నారు. విద్యార్థులకు వర్షాకాలంలో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడంతో పాటు నివాసాల్లో కూడా తల్లిదండ్రులకు దోమలపై అవగాహ న కల్పించి ఆరోగ్యంగా ఉండేందుకు దోహదపడాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌వోలు వెంకటేశ్వర్లు, రామ్మూర్తి, కళాశాల ప్రిన్సిపాల్ రమాదేవి, హె ల్త్‌సూపర్ వైజర్ రాజేశ్వరి, ఉపాధ్యాయురాలు నవ్య, గీత, వాణి, సువర్ణ, ప్రియంక తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సులు రాక విద్యార్థుల అవస్థలు



బస్సు కోసం ఎదురుచూస్తున్న విద్యార్థులు

హాజీపూర్, జూలై 2(ఆంధ్రజ్యోతి): మండలంలోని విద్యార్థులు ఆర్టీసీ బస్సులు రాక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. విద్యార్థులు ఉన్నత చదువుల కోసం దొనబండ గ్రామంలోని పాఠశాలకు వెళ్లాలన్నా, పెద్దంపేట, గొల్లపల్లి గ్రామాల నుంచి దొనబండ పాఠశాలకు రావాలన్నా బస్సులురాక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. గతంలో ఆయా గ్రామాల గుండా ఆర్టీసీ పల్లెవెలుగు బస్సులు నడిచేవి. మంచిర్యాల ఆర్టీసీ డిపో నుంచి హాజీపూర్ మండలంలోని దొనబండ, పెద్దంపేట గ్రామాల మీదుగా ప్రతీ రోజు రెండు ట్రిప్పులు బస్సు నడిచేది. ఈ ఏడాది జూన్‌లో పాఠశాలలు ప్రారంభమైనప్పటికీ బస్సులు నడవకపోవడంతో విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. బస్సు సౌకర్యం లేకపోవడంతో కొందరు విద్యార్థులు ఆటోలో ప్రయాణం చేయాల్సి వస్తోంది. మరికొందరు విద్యార్థులు రవాణ సౌకర్యం లేక పాఠశాలకు వెళ్లేందుకు ముందుకు రావడంలేదు. కలెక్టర్ స్పందించి దొనబండ ప్రభుత్వ పాఠశాలకు ఆర్టీసీ బస్సు సదుపాయం కల్పించాలని విద్యార్థులు కోరుతున్నారు. ఈ విషయమై ఎంఈవో తిరుపతి రెడ్డిని సంప్రదించగా మంచిర్యాల ఆర్టీసీ డిపో మేనేజర్‌తో మాట్లాడామని, గతంలో ఆ రూట్‌లో బస్సు నడిచేది వాస్తవమేనన్నారు. ప్రస్తుతం పల్లెవెలుగు బస్సులు ఖాళీ లేకపోవడంతో నడపడం లేదని తెలిపారు.

బుద్ధవనం ప్రాజెక్ట్ ఎస్‌వో నియామకంపై హర్షం

శ్రీరాంపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ బుద్ధవనం ప్రాజెక్ట్ ప్రత్యేక అధికారి(ఎస్‌వో)గా మల్లేపల్లి లక్ష్మయ్యను తిరిగి నియమించడంపై సెంటర్‌ఫర్ దళిత్ స్టడీస్ కోల్‌బెల్ట్ ఏరియా బాధ్యులు తొగరు సుధాకర్, అందుగుల రాజేశం, గోషిక మల్లేషం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తంచేశారు. మల్లేపల్లి లక్ష్మయ్య సెంటర్ ఫర్ దళిత్ స్టడీస్ చైర్మన్, బౌద్ధ ఉపాసకుడిగా ఉన్నారని, ఆయన గత ప్రభుత్వ హయాంలో 2016 నుంచి 2024 వరకు బుద్ధవనం పీవోగా పనిచేశారన్నారు. తన బాధ్యతను నెరవేర్చి నాగార్జునసాగర్‌లోని బుద్ధవనం ప్రాజెక్ట్‌ను ప్రపంచస్థాయిలో తీర్చిదిద్దారని కొనియాడారు. ఆయన సేవలను గుర్తించి ప్రస్తుత రాష్ట్రప్రభుత్వం సైతం రెండేళ్లపాటు ఎస్‌వోగా నియమించడం ఆనందంగా ఉందన్నారు. ధూళికట్ట బౌద్ధ కట్టడాలను పర్యాటకప్రాంతంగా తీర్చిదిద్దాలని కోరారు.

బీఆర్‌ఎస్ నాయకుల ఆరోపణలు అర్థరహితం

చెన్నూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): చెన్నూరు నియోజకవర్గ ఎమ్మెల్యే, మంత్రి వివేక్‌వెంకటస్వామిపై బీఆర్‌ఎస్ నాయకులు ఆరోపణలు చేయడం అర్థరహితమని కాంగ్రెస్ పార్టీ నాయకులు అన్నారు. బుధవారం ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నాయకులు మాట్లాడారు. బీఆర్‌ఎస్ నాయకులు ఇసుక అక్రమ రవాణా జరుగుతుందని పేర్కొనడం వారి అవివేకమన్నారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలోనే ఎనిమిది ఇసుక రీచ్‌లకు ఈ ప్రాంతంలో అనుమతులు ఇచ్చారన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఒక్క ఇసుక రీచ్‌కు కూడా అనుమతి ఇవ్వలేదన్నారు. మంత్రి ఆదేశాలతో ఇసుక రీచ్‌ల వద్ద సంబంధిత శాఖ అధికారులతో నిఘా ఏర్పాటు చేశారన్నారు. తప్పుడు ప్రచారాలు చేస్తే రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెబుతారన్నారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పట్టణాధ్యక్షుడు చెన్న సూర్యనారాయణ, మాజీ జడ్పీటీసీ కరుణాసాగర్‌రావు, నాయకులు హేమంతరెడ్డి, రాజమల్లగౌడ్, సుశీల్‌కుమార్, శ్రీనివాస్, మధుకర్, తిరుపతిరెడ్డి, నాగరాజు, బషీరొద్దీన్, అంకగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడికి సన్మానం

మంచిర్యాల కలెక్టరేట్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికైన రాంచందర్‌రావును బుధవారం హైద్రాబాద్‌లో బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు.

ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మంచిర్యాల జిల్లా వార్తలు

5

గురువారం 3 జూలై 2025

నాయకత్వ లక్షణాల పెంపునకే సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రాం



సంవిధాన్ మెమొంటోలను ఆవిష్కరిస్తున్న ఎంపీ వంశీకృష్ణ

జైపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): యువకుల్లో నాయకత్వ లక్షణాలను పెంపొందించడం కోసమే సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రాంను ఏర్పాటు చేశామని పెద్దపల్లి ఎంపీ గడ్డం వంశీకృష్ణ పేర్కొన్నారు. బుధవారం ఇందారంలో సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రాం వైట్ టీషర్ట్ ఇనిషియేటివ్ మెమొంటోలను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ నేత రాహుల్‌గాంధీ ప్రారంభించిన సంవిధాన్ లీడర్‌షిప్ ప్రోగ్రాం వైట్ టీషర్ట్ ఇనిషియేటివ్ కార్యక్రమం ద్వారా యువకుల్లో రాజ్యాంగ విలువలపై అవగాహన పెంపొందించడమే కాకుండా బాధ్యతాయుత నాయకత్వ లక్షణాలను పెంపొందించడానికి దోహదపడుతుందన్నారు. యువతకు రాజ్యాంగ పాఠాలు, సమకాలీన సామాజిక అంశాలపై చర్చలు నిర్వహించడంతో పాటు నాయకత్వానికి అవసరమైన విలువలపై యువకులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో చెన్నూరు యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ మహ్మద్ ఇలియాజుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలి



పంచాయతీ రికార్డులను తనిఖీ చేస్తున్న మండల పంచాయతీ అధికారి

తాండూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో ప్రతీ రోజు పారిశుధ్య పనులను ముమ్మరంగా చేపట్టాలని మండల పంచాయతీ అధికారి అనిల్‌కుమార్ సూచించారు. బుధవారం మండలంలోని కొత్తపల్లి గ్రామాన్ని సందర్శించారు. పంచాయతీ కార్యాలయంలో పంచాయతీ రికార్డులను తనిఖీ చేశారు. గ్రామంలో నిర్వహిస్తున్న పారిశుధ్య కార్యక్రమాలను పరిశీలించారు. ఇంటింటికి చెత్త సేకరించాలని, గ్రామంలో ఎక్కడా ప్లాస్టిక్ కవర్లు, ఇతర వ్యర్థాలు లేకుండా చూడాలన్నారు. సీజనల్ వ్యాధులు వచ్చే అవకాశాలున్నందున గ్రామాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలన్నారు. పరిసరాల పరిశుభ్రత, వేడినీటిని చల్లార్చి తాగడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి లక్ష్మణ్, సిబ్బంది ఉన్నారు.

జలాన్ని ఒడిసిపట్టుదాం...

● గ్రామాల్లో జోరుగా ఇంకుడు గుంతల నిర్మాణాలు

7

నిధులు గోల్‌మాల్





క్లబ్‌లో పోలీసులు పట్టుకున్న పేకాట రాయుళ్లు (ఫైల్)

- మంచిర్యాల క్లబ్‌లో రూ. మూడు కోట్ల మేర మాయమైన నగదు
- రిక్రియేషన్ పేరుతో సభ్యత్వ స్వీకరణ
- ఒక్కో సభ్యుడి వద్ద రూ. లక్షకుపైగా వసూలు
- పేకాటనూ ప్రోత్సహిస్తున్న నిర్వాహకులు

మంచిర్యాల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని హైటెక్‌సిటీ కాలనీలో ఉన్న 'మంచిర్యాల క్లబ్'లో పెద్ద మొత్తంలో నిధులు గోల్‌మాల్ అయినట్లు తెలుస్తోంది. రిక్రియేషన్ పేరిట నిర్వహిస్తున్న క్లబ్‌లో పేకాటే ప్రధానంగా కార్యకలాపాలు సాగుతుండగా, జిమ్, స్విమ్మింగ్ పూల్, షటిల్ కోర్టు కూడా అందుబాటులో ఉన్నాయి.

ఇక్కడ సభ్యత్వం పొందాలంటే పెద్ద మొత్తంలో సభ్యత్వ రుసుం చెల్లించాల్సి ఉంటుంది. క్లబ్‌కు అనుసంధానంగా బార్ కూడా ఉండటంతో పేకాట ఆడుతూ మద్యం సేవించడం ఇక్కడ అనవాయితీగా వస్తోంది. ఇందులో రాజకీయ ప్రముఖులు, ప్రభుత్వ ఉద్యోగులు, రియల్ ఎస్టేట్, వడ్డీ వ్యాపారులు సభ్యులుగా ఉన్నారు. ఇక్కడ పేకాట నిత్యకృత్యమన్న విషయం రామగుండం కమిషనరేట్ పోలీసుల దాడుల్లో వెల్లడైంది.

● ఖరీదైన సభ్యత్వం....

మంచిర్యాల క్లబ్‌లో సభ్యత్వం అత్యంత ఖరీదైంది. డబ్బులు కట్టగలిగే స్తోమత ఉంటే చాలు.. ఎలాంటి అర్హత లేకపోయినా ఇక్కడ సభ్యత్వం తీసుకోవచ్చు. ప్రస్తుతం మంచిర్యాల క్లబ్‌లో సభ్యత్వం తీసుకోవాలంటే రుసుం కింద 1.5లక్షల రూపాయలు వసూలు చేస్తున్నారు. పేకాట వ్యసనం ఉన్నవారు స్తోమత లేకపోయినా ఫైనాన్స్‌ల్లో అప్పులు తెచ్చి మరీ సభ్యత్వం తీసుకుంటారని వినికిడి. మంచిర్యాలక్లబ్‌లో ప్రస్తుతం 750కుపైగా సభ్యులు ఉన్నారు. క్లబ్‌లో లక్షలు చెల్లించి సభ్యత్వం తీసుకున్న వారిలో అనేక మంది పేకాటలో నష్టాలు వచ్చి రోడ్డున పడ్డవారేనన్న ప్రచారమూ ఉంది. సంపన్నుల సంగతి పక్కన బెడితే మేకపోతు గాంభీర్యం ప్రదర్శించి ఉన్నది పోగొట్టుకున్న వారే ఇక్కడ అధికంగా ఉన్నట్లు సమాచారం.

● నిబంధనలకు పాతర...

రిక్రియేషన్ పేరిట కొనసాగుతున్న మంచిర్యాల క్లబ్‌లో రమ్మీ పేరిట జూదం ఆడుతుంటారని సమాచారం. ఒక్కో గేమ్‌కు మూడువేల రూపాయల చొప్పున చెల్లిస్తూ, పెద్దమొత్తంలో..

(మిగతా 7లో)

లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటించాలి

మండల ప్రత్యేకాధికారి అజ్మీర పురుషోత్తంనాయక్

కాసిపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలకు అర్హులైన లబ్ధిదారులను ఎంపిక చేసి పారదర్శకత పాటించాలని మండల ప్రత్యేకాధికారి అజ్మీర పురుషోత్తంనాయక్ అన్నారు. బుధవారం మండలపరిషత్ కార్యాలయం ఆవరణలో అన్నిప్రభుత్వ శాఖల అధికారులతో సమీక్షాసమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇందిరమ్మఇళ్ల లబ్ధిదారుల ఎంపిక, రాజీవ్ యువవికాసం లబ్ధిదారుల ఎంపికలో ఎటువంటి అవకతవకలకు పాల్పడకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో వేగంపెంచి నిర్ణీత గడువులోగా ఇళ్లనిర్మాణం పూర్తిచేయాలన్నారు. మండలంలో చేపట్టబోయే వనమహోత్సవం కార్యక్రమంలో లక్షా 62వేల మొక్కలు నాటాలన్నారు. వర్షాకాలంలో సీజనల్‌వ్యాధులు ప్రబలే అవకాశం ఉంటుదని పంచాయతీరాజ్, ఆరోగ్య వైద్య సిబ్బంది గ్రామాల్లో పర్యటించి పరిసరాలను పరిశుభ్రత, వ్యక్తిగత శుభ్రతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఆదేశించారు. ప్రజావాణిలో వచ్చిన దరఖాస్తులను పరిశీలించి సమస్యల పరిష్కారానికి అధికారులు కృషి చేయాలన్నారు. అంగన్‌వాడీల నిర్వహణ, తాగునీరు, గ్రామీణ ఉపాధిహామీపథకం, రేషన్‌కార్డుల పరిశీలన, పశువైద్య కేంద్రాల నిర్వహణపై స్థానిక అధికారులు పర్యవేక్షించాలని కోరారు. సిబ్బంది విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే శాఖపరంగా చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సమావేశంలో జడ్పీ సీఈవో గణపతి, ఎంపీడీవో సత్యనారాయణ సింగ్, ఏఈపీఆర్ జగన్, ఏపీవో నవీన్, ఏపీఎం వెంకటేశ్, ఏఈ హౌజింగ్ గణేష్, సీనియర్ సహాయకులు లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

హెడ్‌కుక్ పోస్టు కోసం దరఖాస్తుల ఆహ్వానం

మందమర్రిరూరల్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాలలో హెడ్‌కుక్ పోస్టు కోసం మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని ఎంఈవో దత్తుమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై స్థానికులైన మహిళలు ఈనెల 7వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు.

అసిస్టెంట్ కుక్ పోస్టుకు...

కన్నెపల్లి: కన్నెపల్లిలోని కస్తూర్బా పాఠశాలలో ఖాళీగా ఉన్న అసిస్టెంట్ కుక్ పోస్టుకు స్థానిక మండలానికి చెందిన మహిళల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు మండల విద్యాధికారి రాము ఒక ప్రకటనలో తెలిపారు. ఏడో తరగతి పాసై ఉండి 18నుంచి 45 ఏళ్ల వయస్సు ఉండాలని సూచించారు. ఈ నెల 7వ తేదీలోగా ఎంఈవో కార్యాలయంలో దరఖాస్తులు అందించాలని సూచించారు.

పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

● జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు



విద్యార్థులతో మాట్లాడుతున్న డీపీవో వెంకటేశ్వర్‌రావు

లక్షెట్టిపేట, జూలై 2(ఆంధ్రజ్యోతి): పాఠశాల, కళాశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావు విద్యార్థులకు సూచించారు. లక్షెట్టిపేట పట్టణంలోని ప్రభుత్వ పాఠశాల, కళాశాలను డీపీవో బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీవో మాట్లాడుతూ పాఠశాల దేవాలయంలాంటిదని దీన్ని పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటేనే ఆరోగ్యంగా ఉంటామని సీజనల్ వ్యాధులు కూడా రావన్నారు. చిత్తు కాగితాలను ఎక్కడపడితే అక్కడ పడేయకూడదని ప్రతీ తరగతి గదిలో తప్పకుండా చెత్తబుట్టను ఏర్పాటు చేసుకోవాలన్నారు. ఎప్పటికప్పుడు పాఠశాల, కళాశాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం పాఠశాల మధ్యాహ్న భోజన వంటశాలను పరిశీలించి పరిశుభ్రతపై నిర్వహకులకు పలు సలహాలు సూచనలు అందజేశారు. డీపీవో వెంట ఎంపీడీవో సరోజ, ప్రిన్సిపల్ లక్ష్మణ్‌రావు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు ఉన్నారు.

సరిపడా యూరియా ఉంది.. ఆందోళన వద్దు

● జిల్లా వ్యవసాయ అధికారి కల్పన



నెన్నెలలో ఎరువుల దుకాణంలో రికార్డులు పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి, భీమిని ఏడీఏ

నెన్నెల, జూలై 2 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో సీజన్‌కు సరిపడా యూరియా అందుబాటులో ఉందని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన అన్నారు. రైతు లు యూరియా కోసం ఆందోళన చెందవద్దని సూచించారు. మండల కేంద్రంలోని ఫర్టిలైజర్ షాపులు, గోదాములను బుధవారం ఆమె ఆకస్మి కంగా తనిఖీ చేశారు. దుకాణాల్లోని విత్తనాలు, ఎరువుల నిల్వలు, స్టాక్ రిజిస్టర్లను పరిశీలించారు. అనంతరం విలేకరులతో మాట్లాడారు. జిల్లా రైతాంగం ప్రస్తుతం విత్తనాలు వేసుకుంటున్నారని, ఇప్పటికిప్పుడు పంట లకు యూరియా అవసరం లేదన్నారు. దారులులేని రైతులు చేలల్లో నిల్వ చేసుకునేందుకు యూరియా కోసం ఎగబడుతుండటంతో పంపిణీలో గందరగోళం నెలకొంటుందన్నారు. ఇండెంట్ ప్రకారం అన్ని మండలాలకు సరిపడా ఎరువులు సరఫరా చేస్తామన్నారు. ఇప్పటివరకు జిల్లాలో ఏడు వేల మెట్రిక్ టన్నుల యూరియా పంపిణీ చేశామని, మరో ఐదు వేల మెట్రిక్ టన్నులు త్వరలో వస్తుందన్నారు. సహకార సంఘాలతో పాటు, ప్రైవేటు డీలర్ల వద్ద కూడా యూరియా, డీఏపీ అందుబాటులో ఉంద న్నారు. ఎరువులు కృత్రిమ కొరత సృష్టించి అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని డీలర్లను హెచ్చరించారు. ఆమెవెంట భీమిని ఏడీఏ సురేఖ, ఏవో పుష్పాల సృజన ఉన్నారు.

● ఈ-పాస్ ద్వారానే పంపిణీ చేయాలి

ఎరువులను ఈ-పాస్ ద్వారానే పంపిణీ చేయాలని జిల్లా వ్యవసాయ అధికారి కల్పన అన్నారు. నెన్నెల రైతువేదికలో డీలర్లకు ఈ-పాస్ యంత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆధునిక సాంకేతికతను సద్వినియోగం చేసుకునేందుకు పాత వాటి స్థానంలో కొత్త మెషిన్లు అందజేస్తున్నామన్నారు. రైతుల ఆధార్ నంబరుతో పాటు, కొనుగోలు చేసిన ఎరువుల వివరాలను ఎప్పటికప్పుడు యంత్రంలో నమోదు చేయాలని సూచించారు. నూతన విధానం ద్వారా ఎరువుల పంపిణీ పారదర్శకంగా జరుగుతుందని, ఎరువులు పక్కదోవ పట్టే అవకాశం లేదన్నారు. రైతులకు ప్రభుత్వ ఆమోదిత విత్తనాలను అమ్మి.. విధిగా పూర్తి వివరాలతో కూడిన రసీదు ఇవ్వాలని సూచించారు. దుకాణం ఎదుట ధరలు, ఎరవుల స్టాక్ వివరాలను తెలిపే బోర్డులను తప్పకుండా ఏర్పాటు చేయాలన్నారు. భీమిని ఏడీఏ సురేఖ, టెక్నికల్ ఏవో శ్రీనివాస్, నెన్నెల, వేమనపల్లి, భీమిని, కన్నెపల్లి మండలాల వ్యవసాయ అధికారులు సృజన, వీరన్న, ప్రశాంత్, యమునా, డివిజన్‌లోని డీలర్లు పాల్గొన్నారు.

మండల విద్యాధికారిగా సీహెచ్ మొగిలి



బాధ్యతలు స్వీకరిస్తున్న ఎంఈవో సీహెచ్ మొగిలి

కోటపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల విద్యాధికారిగా సీహెచ్ మొగిలి బుధవారం స్థానిక ఎంఆర్‌సీలో పదవీ బాధ్యతలు చేపట్టారు. ఇంతకాలం ఎంఈవోగా పనిచేసిన వెంకటేశ్వర్లు పదవీవిరమణ పొందడంతో సిర్సా పాఠశాల హెచ్‌ఎం సీహెచ్ మొగిలిని ఇన్‌చార్జి ఎంఈవోగా నియమిస్తూ విద్యాశాఖ ఉత్తర్వులు జారీ చేసింది. కాగా బాధ్యతలు చేపట్టిన మొగిలిని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు కొట్టె శంకర్, మండల ప్రధాన కార్యదర్శి కోమట్ల బాపు, సంఘం నాయకులు నాగేందర్, అంజన్‌కుమార్, మాదాసు కిష్టయ్య సన్మానించారు. కార్యక్రమంలో ఎంఐఎస్ మల్లేష్, సీఆర్‌పీలు సంపత్, మొగిలి, గణపతి, సీసీవో శరణ్య, కృష్ణవేణి తదితరులు పాల్గొన్నారు.

నైపుణ్యం పెంపొందించేందుకే పోలీసు డ్యూటీ మీట్

● రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా



కాళేశ్వరం జోన్ స్థాయి పోలీసు డ్యూటీ మీట్‌లో మాట్లాడుతున్న రామగుండం సీపీ అంబర్‌కిషోర్‌ఝా

మంచిర్యాలక్రైం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): పోలీస్‌వృత్తిలో మరింత నైపుణ్యం, సామర్థ్యం పెంపొందించేందుకే పోలీస్‌డ్యూటీ మీట్ నిర్వహిస్తున్నట్టు రామగుండం పోలీసు కమిషనర్ అంబర్ కిషోర్‌ఝా అన్నారు. తెలంగాణ రాష్ట్ర రెండో పోలీసు డ్యూటీమీట్‌లో భాగంగా కాళేశ్వ రం జోన్ పరిధిలోని రామగుండం పోలీసు కమి షనరేట్ పరిధిలోని పెద్దపల్లి, మంచిర్యాల జోన్, కుమరంభీం ఆసిఫాబాద్, జయశంకర్ భూపాల పల్లి, ములుగు జిల్లా పరిధిలో ఉన్న పోలీసు అధికారులకు, సిబ్బందికి పోలీసు డ్యూటీ నిర్వ హించామన్నారు. విధుల్లో తీసుకోవాల్సిన జాగ్ర త్తలు, నేర దర్యాప్తుల్లో మరింత శాస్త్రీయత సాధించేందుకు అవగాహన కల్పించారు. క్షేత్ర స్థాయిలో నేరవిచారణకు ఎదురయ్యే అంశాలకు సంబంధించి విధులపై ప్రదర్శన చేయడం ద్వారా మెలకువలు నేర్చుకునే అవకాశం ఉంద న్నారు. ఫోరెన్సిక్ సైన్స్, క్రైం ఇన్విస్టిగేషన్, క్రిమినల్ లా, రాత పరీక్ష, మెడికో లీగల్ టెస్టు, ఓరల్ టెస్టు లిఫ్టింగ్ అండ్ ప్యాకింగ్ ఆఫ్ ఎక్స్‌బిట్ ప్రాక్టికల్ టెస్ట్, ఫింగర్ ప్రింట్ సైన్స్ ప్రాక్టికల్ ఓరల్ టెస్టు అండ్ క్రైం సీన్ ఫొటోగ్రఫీ ప్రాక్టికల్, పోలీసు పోర్ట్రైట్, రిటర్న్ టెస్టు, అబ్జ ర్వేషన్ టెస్టు, రిటెన్‌టెస్ట్, డాగ్‌స్క్వాడ్ కాంపీటీషన్ ఈవెంట్‌లో వాకింగ్, ఎక్స్‌ప్లోజీవ్, నార్కొ టిక్స్ వివిధ విభాగాల్లో ప్రతిభ కనబరిచిన వారిని ఈనెలలో వరంగల్‌లో జరిగే తెలంగాణ రాష్ట్రస్థాయి పోలీసు డ్యూటీ మీట్‌కు ఎంపిక చేస్తామని తెలిపారు. సైంటిఫిక్ ఇన్విస్టిగేషన్, ఫింగర్ ప్రింట్ ఇన్విస్టిగేషన్ కోసం సాంకేతిక పరిజ్ఞానం, కేసుల దర్యాప్తులో మెలకువలు నేర్చుకునేందుకు పోలీసుమీట్ ఎంతో ఉపయో గపడుతుందన్నారు. ఇక్కడ ఎంపికైన వారు కాళేశ్వరం జోన్‌కు మంచిపేరు తీసుకురావాలని సీపీ సూచించారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, స్పెషల్ బ్రాంచి ఏసీపీ మల్లారెడ్డి, గోదావరిఖని ఏసీపీ రమేశ్, ట్రాఫిక్ ఏసీపీ శ్రీనివాస్ పాల్గొన్నారు.

ప్రజల రక్షణ కోసం హోంగార్డులు అందుబాటులో ఉండాలి

హోం గార్డులు ప్రజల రక్షణకోసం ఎల్లప్పుడు అందు బాటులో ఉండాలని రామగుండం సీపీ అంబర్ కిషోర్‌ఝా సూచించారు. పెద్దపల్లి, మంచిర్యాల జోన్ పరిధిలోని హోంగార్డులకు హోంగా ర్డులకు రేయిన్ కోట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వర్షాకాల సమయంలో ట్రాఫిక్ నియంత్రణ, రాత్రిపూట విధుల్లో బందోబస్తు విధులను హోంగార్డులు విధులు నిర్వర్తించడానికి రెయిన్‌కోట్‌లు ఉపయోగపడతాయన్నారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ రాజు, ఏఆర్ ఏసీపీ ప్రతాప్, ఆర్ఐ హోంగార్డు వామనమూర్తి పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై జాగ్రత్తగా ఉండాలి

జన్నారం, జూలై 2 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీజనల్ వ్యాధులపై రోగులకు వైద్య సేవలందించడంలో సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డిప్యూటి డీఎంహెచ్‌వో సుధాకర్ నాయక్ సూచించారు. మండల కేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాన్ని డిప్యూటి డీఎంహెచ్‌వో బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సిబ్బందితో ఆయన మాట్లాడుతూ మండలంలో గిరిజన ఆదివాసీ గ్రామాలు అత్యధింగా ఉన్నాయని ప్రతి సంవత్సరం సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నాయని తెలిపారు. ఎప్పటికప్పుడు సిబ్బంది అప్రమత్తంగా ఉంటూ రోగులకు సేవలందించాలని ఆదేశించారు. రోజువారీ ఓపీతోపాటు గ్రామాల్లో వైద్య శిబిరాలు ఏర్పాటు చేయాలని, రోగులకు మందులు అందుబాటులో ఉంచాలని సూచించారు. టీబీ, సికిల్‌సెల్ వ్యాధులపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో డాక్టర్ ఉమశ్రీ, డాక్టర్ లక్ష్మి, సూపర్‌వైజర్లు ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య: డీఈవో

● పదేళ్ల క్రితం మూతపడ్డ ప్రాథమిక పాఠశాల పునః ప్రారంభం



చప్పట్లు కొట్టి విద్యార్థులను ప్రోత్సహిస్తున్న డీఈవో

హాజీపూర్, జూలై 2 (ఆంధ్రజ్యోతి): సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య అందిస్తున్నామని డీఈవో యాదయ్య తెలిపారు. వేంపల్లిలో పదేళ్లుగా మూతపడ్డ ప్రభుత్వ పాఠశాలను బుధవారం డీఈవో యాదయ్య పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆచార్యజయశంకర్ బడిబాట కార్యక్రమం లో భాగంగా 10 మం ది విద్యార్థులు చేరగా పాఠశాలను పునఃప్రా రంభించడం సంతోషంగా ఉందన్నారు ప్రైవేటు పాఠశాలకు దీటుగా సర్కారు బడు ల్లో ఆంగ్ల మాధ్యమం లో బోధన చేస్తున్నామని తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని కోరారు.

అనంతరం నంనూర్ మండలపరిషత్ ప్రాథమిక పాఠశాలను సందర్శించి విద్యార్థుల సామర్థ్యాలను పరిశీలించారు. ప్రతిభకనబరిచిన విద్యార్థులను చప్పట్లతో ప్రోత్సహించారు. కార్యక్ర మంలో సెక్టోరియల్ అధికారులు చౌదరి, సత్యనారాయణ, ఎంఈవో తిరుపతిరెడ్డి, మండల నోడల్ అధికారి హనుమాండ్లు, హెచ్‌ఎం సుధారాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

15 ఏళ్ల తర్వాత తెరుచుకున్న సర్కారు బడి

దండేపల్లి, జూలై 2 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంత నిరుపేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలోనే నాణ్యమైన విద్యను అందిస్తుందని దండేపల్లి మండల విద్యాధికారి దుర్గం చిన్నయ్య, ఎస్సై ఎండీ తహసీనోద్దీన్ అన్నారు. దండేపల్లి మండలం కొత్తమామిడిపల్లి గ్రామంలో 15ఏళ్ల కిత్రం విద్యార్థులు లేక మూతబడింది. బడిబాటలో భాగంగా 20మంది విద్యార్థులు పాఠశాలలో చేరారు. దీంతో గ్రామస్థులతో కలిసి అధికారులు, నాయకులు పాఠశాలను పునఃప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పాఠశాల పునః ప్రారంభానికి గ్రామస్థులు కృషి అభినందనీయమన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ సభ్యురాలు గడ్డం నాగరాణి త్రిమూర్తి, స్కూల్ కాంప్లెక్స్ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నరేందుల శ్రీనివాస్, మాజీ సర్పంచు గడ్డం రాజయ్య, నాయకులు గడ్డం రాంచందర్, బత్తుల రమేష్, అక్కల కృష్ణ, ఎంఐసి నగేష్, సీఆర్‌పి గరిగే నర్సయ్య గ్రామస్థులు పాల్గొన్నారు.



మామిడిపల్లి ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులతో అధికారులు, నాయకులు, గ్రామస్థులు

హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు కదలాలి

● ముదిరాజ్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం

మంచిర్యాలక్రైం, జూలై 2(ఆంధ్రజ్యోతి): ముదిరాజుల హక్కుల సాధన కోసం ఐక్యంగా ముందుకు సాగాలని ముదిరాజు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుర్రాల మల్లేశం అన్నారు. పట్టణంలో ఏర్పాటు చేసిన ముదిరాజుల మహాసభ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ముదిరాజులను బీసీడీ నుంచి ఏకు మార్చాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 60 లక్షలకుపైగా ఉన్న ముదిరాజ్‌లకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు మోసం చేస్తున్నాయని విమర్శించారు. ముదిరాజులు మేల్కొని హక్కులసాధనకోసం పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. మత్స్యకారులకు సొసైటీ రుణాలు అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు గరిగంటి కొమురయ్య, బల్ల సత్తయ్య, శ్రీకాంత్, కంకణాల సతీష్, సాదనబోయిన క్రిష్ణ, రాజేశం తదితరులు పాల్గొన్నారు.

మైనింగ్ శాఖ అధికారులతో మంత్రి సమావేశం

చెన్నూరు, జూలై 2 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్ర సెక్రటేరియట్‌లో బుధవారం మైనింగ్ శాఖ అధికారులతో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నియమ నిబంధనలు పాటిస్తూ మైనింగ్ కార్యకలాపాలు నిర్వహించాలని, భద్రత ప్రమాణాలకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. అలాగే రాష్ట్ర ఆదాయాన్ని పెంచే విధంగా మైనింగ్ రంగాన్ని మెరుగు పరిచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే తన దృష్టికి తీసుకురావాలని, వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. సమావేశంలో మైనింగ్ విభాగాల అధికారులు, సాంకేతిక నిపుణులు పాల్గొన్నారు.